

ఇద్దరికి సాహిత్య అకాడమీ పురస్కారాలు
- జానీకి యువ, డికె చదువుల బాబుకు బాల పురస్కారం

6

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 323 | విజయవాడ, శనివారం 24 జూన్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 24 June 2023 | Rs

టెన్త్ సప్లిమెంటరీలో 63.10 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో 63.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ శుక్రవారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ నెల 2 నుంచి 10 వరకు జరిగిన పరీక్షలకు 1,87,923 మంది హాజరవ్వగా, 1,18,588 (63.10 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 65,372 (59.32 శాతం) మంది, 53,216 (68.48 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు www.bse.ap.gov.in లో పొందుపరిచారు. ప్రకాశం జిల్లా అత్యధికంగా 91.21 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, కృష్ణా జిల్లా 40.56 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. నాలుగు రోజుల తరువాత మార్కుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్ ఎప్.ఎం.ఎఎ.జా.స్టేక్.ఆఅలో అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డి వెల్లడించారు. రీకౌంటింగ్ సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.1000 ఈ నెల 29వ తేదీలోపు సిఎఫ్ఎంఎస్ చలాన్(www.cfms.ap.gov.in) ద్వారా చెల్లించాలని తెలిపారు.

అర్హుల తలుపు తట్టేందుకే..

- 'జగనన్న సురక్ష' ప్రారంభిస్తూ సిఎం జగన్
- జులై 1 నుంచి క్యాంపులు



'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నోరు తెరిచి అడగలేని, అర్హత ఉండి పొరపాటున ఎక్కడైనా మిగిలిపోయిన అర్హులను కూడా తలుపుతట్టి మరీ మంచి చేసే కార్యక్రమమే 'జగనన్న సురక్ష' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పేదలకు, పేద లబ్ధిదారులకు ప్రభుత్వమే ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా, ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, గృహ సారథులందరూ నేరుగా లబ్ధిదారుల దగ్గరకు వెళ్లడమే జగనన్న సురక్ష కార్యక్రమమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సిఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26 జిల్లాలకు ప్రత్యేక సీనియర్ ఐఎఎస్‌లను పర్యవేక్షక అధికారులుగా నియమించామని, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఇతర అధికారులు అన్ని క్యాంపుల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం జరుగుతున్న తీరుపై జిల్లా కలెక్టర్లు రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, వారానికి ఒకరోజు సిఎంఓ, చీఫ్ సెక్రటరీ కూడా మానిటరింగ్ చేస్తారని సిఎం వెల్లడించారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ.. జగనన్న సురక్ష అనే ఈ కార్యక్రమానికి నాంది పలికామన్నారు. అర్హులై ఉండి ఏ ఒక్కరూ కూడా నాకు ఈ సేవలు అర్హత ఉండి అందలేదని అని అంటే అలాంటి వారిని జల్లెడ పట్టి వారికి కావాల్సిన డాక్యుమెంటేషన్ కోసం చేయి పట్టుకుని నడిపిస్తూ వారికి మంచి చేసే కార్యక్రమమే ఇది అని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 600 రకాల పౌర సేవలు తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో తీసుకొచ్చామన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా ఈ నాలుగేళ్ల కాలంలో రూ.2.16 లక్షల కోట్లు బటన్‌నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి అత్యంత పారదర్శకంగా వివక్ష, అవినీతి లేకుండా జమచేశామని తెలిపారు. నాన్ డిబిటిలో ఇళ్ల స్థలాల విలువ కూడా కలుపుకుంటే రూ.3.10 లక్షల కోట్లు దాటిందన్నారు. పథకాల మంజూరుతోపాటు వివిధ రకాల సర్టిఫికెట్లు జగనన్న సురక్ష కార్యక్రమంలో జారీ చేస్తారన్నారు. ఆదాయం, కులం, ఫ్యామిలీ, పుట్టినరోజు, కొత్త రేషన్‌కార్డులు, సిసిఆర్‌సి కార్డులు, ఆధార్‌కు బ్యాంకు లింకేజీ, ఆధార్ కార్డులో మార్పులు ఇవన్నీ కూడా ఈ కార్యక్రమం కింద చేపడతారన్నారు. ఆధార్ కార్డుల మార్పు కోసం 2,500 ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు సిఎం జగన్ వెల్లడించారు. ఎలాంటి సర్వీసు ఛార్జీలు లేకుండానే 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత సచివాలయాల పరిధిలో ఎప్పుడు క్యాంపులు పెడతారు? మండల అధికారులు ఎప్పుడు వస్తారనే తేదీలు కూడా వారికి చెప్తారని, ఆ రోజున వారిని క్యాంపులకు తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించేలా చూస్తారని సిఎం వెల్లడించారు. మండల స్థాయిలో తహశీల్దారు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఒక టీమ్‌గా, డిప్యూటీ తహశీల్దారు, ఎంపిడిఒ రెండో టీమ్‌గా ఏర్పడతారని, ప్రతి మండలంలో ప్రతిరోజూ రెండు సచివాలయాలకు వెళ్తారని, జులై 1 నుంచి ఈ క్యాంపులను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బూడి ముత్యాలనాయుడు, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాట్నాలో సమావేశమైన ప్రతిపక్షాల నేతలు

బిజెపిని ఐక్యంగా ఎదుర్కొంటాం

- పాట్నాలో ప్రతిపక్షాల సమావేశంలో నేతలు
- జులైలో సిమ్లాలో తదుపరి సమావేశం
- ఉమ్మడి అజెండా ఖరారు చేస్తాం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి మోడి నష్టపు పాలనను అంతమొందించడమే ధ్యేయంగా వచ్చే లోక్‌సభ ఎన్నికలను కలిసికట్టుగా ఎదుర్కొంటామని 17 ప్రతిపక్ష పార్టీలు స్పష్టంగా ప్రకటించాయి. పాట్నాలో శుక్రవారం జరిగిన ప్రతిపక్ష పార్టీల తొలి సంయుక్త సమావేశం బిజెపి మతతత్వ రాజకీయాలను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. సమావేశం అనంతరం ప్రతిపక్ష పార్టీల నేతలు మీడియా గోష్టిలో మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవిలువలను నాశనం చేసిన బిజెపిని ఇంటికి సాగనంపేవరకు విశ్రమించబోమని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు వ్యూహాన్ని రూపొందించడానికి శుక్రవారం బీహార్ రాజధాని పాట్నాలో 17 రాజకీయ పార్టీలు సమావేశమయ్యాయి. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన సమావేశానికి బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అధ్యక్షత వహించారు. ప్రతిపక్ష పార్టీలు మరింత సమన్వయంతో ముందుకు సాగడానికి భవిష్యత్ కార్యాచరణను రూపొందించడానికి రెండో వారంలో హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో జరిగే సమావేశంలో కూటమి విధివిధానాలను ఖరారు చేయాలని నిర్ణయించారు. సమావేశ అనంతరం నితీష్ కుమార్ మాట్లాడుతూ "సమావేశం ఫలప్రదమైంది. పలువురు నాయకులు నిష్కర్షగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. 17 పార్టీలు కలిసి పని చేయాలని నిర్ణయించాం. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయడానికి ఏకాభిప్రాయం కుదిరింది. కేంద్రంలోని ప్రస్తుత పాలనపై ఐక్యంగా పోరాడేందుకు ఉమ్మడి కూటమి ఏర్పాటుకు నేతలంతా అంగీకరించారు" అని అన్నారు. తాము దేశ ప్రయోజనాల కోసం పని చేస్తుంటే బిజెపి దేశ ప్రయోజనాలకు చేటుతెచ్చేలా వ్యవహరిస్తోందని విమర్శించారు.

సిమ్లాలో ఎజెండా రూపొందిస్తాం : మల్లికార్జున ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ భవిష్యత్తు ఎజెండా సిద్ధం చేసేందుకు జులైలో హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో ప్రతిపక్ష నేతల తదుపరి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఎజెండాను సిద్ధం చేయాలని నిర్ణయించుకున్నాం, ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై వచ్చే సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుందని, ప్రధానంగా బిజెపిని ఓడించడానికి కలిసికట్టుగా కృషి చేస్తామని తెలిపారు. 2024 ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాల్లో కలిసికట్టుగా ఎలా పోరాడాలనే విషయమై ఒక ఎజెండాను రూపొందిస్తామని పేర్కొన్నారు.

సిద్ధాంతాల మధ్య పోరు : రాహుల్ గాంధీ

ఇది సిద్ధాంతాల మధ్య పోరు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. "మాకు కొన్ని విభేదాలు ఉండవచ్చు, అయితే ఒక లక్ష్యం కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాము. మా భావజాలాన్ని కాపాడుకోవడానికి కృషి చేస్తాం" అని అన్నారు. నిజానికి, తమ మధ్య చిన్నచిన్న విభేదాలు ఉన్నప్పటికీ కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. దేశ పునాదులపై బిజెపి దాడి చేస్తోందని, ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడితేనే దేశాన్ని రక్షించుకోవచ్చని అన్నారు. దేశం కోసం త్యాగాలు చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని, ఢిల్లీ ఆర్డినెన్స్ వివాదంపై ఆప్‌తో విభేదాలు పరిష్కరించుకుంటామని రాహుల్ గాంధీ అన్నారు.

ఓట్లు చీలకుండా రాష్ట్రాల్లో చర్చలు : సీతారాం ఏచూరి

దేశాన్ని ఫాసిస్ట్ హిందుత్వ దేశంగా మార్చేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోందని, దీనిని ఐక్యంగా ప్రతిఘటించాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. భారత లౌకిక ప్రజాస్వామ్య నిర్మాణాన్ని నాశనం చేసేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని, సమాఖ్య సూత్రాలు, లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి రాజ్యాంగ స్తంభాలన్నీ నిరంతరం దాడికి గురవుతున్నాయని విమర్శించారు. లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా మన చరిత్రను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, సంఘ్ పరివార్ ఫాసిస్ట్ విధానాలపై సమిష్టిగా పోరాడాలని అన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అంతర్గత భద్రతా ఉల్లంఘనలు వంటి ప్రజలను ప్రభావితం చేసే సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్త ఆందోళన చేయనున్నాయని తెలిపారు. బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా రాష్ట్రాల్లో చర్చలు జరగనున్నాయని అన్నారు.

ఐక్య ఫ్రంట్ ప్రజల ఆశీర్వాదం పొందుతుంది : శరద్ పవార్

ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ మాట్లాడుతూ "ఇక్కడ (పాట్నా) ప్రారంభమైన జెపి ఉద్యమం మాదిరిగానే, మా ఐక్య ఫ్రంట్‌కు ప్రజల ఆశీస్సులు లభిస్తాయి" అని అన్నారు.

కలిసే ఉన్నాం.. కలిసికట్టుగా పోటీ చేస్తాం : మమతా బెనర్జీ

ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా ఉన్నాయని, కలిసికట్టుగానే ఎన్నికల్లో పోరాడతాయని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. పాట్నాలో ఏది ప్రారంభమైనా మిగతా 5లో

మళ్లీ రేషనలైజేషన్

- విలీనం పేరుతో ఎయిడెడ్, యుపి పాఠశాలలు మూత
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషనలైజేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పాఠశాలలను మూసివేసేందుకు పూనుకుంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని విలీనం పేరుతో మూసివేతకు సిద్ధమైంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలలను విలీనం చేయాలని, 6, 7, 8 తరగతుల్లో 30లోపు విద్యార్థులు ఉన్న యుపి పాఠశాలలను విలీనం చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిఓ 59, 60ను శుక్రవారం విడుదల చేశారు. ఈ రెండు నిర్ణయాల వల్ల అటు ఎయిడెడ్ పాఠశాలలు, అటు యుపి పాఠశాలలు కనుమరుగు కానున్నాయని విద్యావేత్తలు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య 30లోపు ఉన్న ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల(పిఎస్)ను కిలోమీటర్ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయనుంది. అదేవిధంగా ఎయిడెడ్ యుపి పాఠశాలల్లో 6, 7 తరగతుల సంఖ్య 35 కంటే తక్కువగా ఉంటే మూడు కిలోమీటర్ల పరిధిలో యుపి పాఠశాలల్లో విలీనం చేయనుంది. విద్యార్థుల సంఖ్య 75 కంటే తక్కువగా ఉన్న ఉన్నత పాఠశాలలను మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేయనుంది. ఈ విలీనం కానున్న పాఠశాలల్లో టీచర్లను మిగులుగా పేర్కొంది. ఎయిడెడ్ పాఠశాలల్లో రేషనలైజేషన్ మార్గదర్శకాలను జిఒ 59లో ప్రభుత్వం పేర్కొంది. 6, 7, 8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30 కంటే తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులను 3 కిలోమీటర్లకు మించి దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలో గానీ, మరో ప్రాథమికోన్నత పాఠశాలలో గానీ విలీనం చేయాలని పేర్కొంది. 6, 7, 8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30కు మించి ఉంటే ముగ్గురు సబ్జెక్ట్ టీచర్లు ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అది కూడా విద్యార్థుల సంఖ్య 98 దాటితేనే సబ్జెక్ట్ టీచర్లు ఉంటారని పేర్కొంది. విద్యార్థుల సంఖ్య 30 దాటిన 484 యుపి పాఠశాలలకు 1,452 సబ్జెక్టు టీచర్లను మంజూరు చేసింది. ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు 60 మంది విద్యార్థులుంటే ఇద్దరు టీచర్లు ఉండాలని పేర్కొంది. విద్యార్థుల సంఖ్య 90 వరకు ఉంటే మూడో టీచర్, 120 వరకు ఉంటే నాలుగో టీచర్‌ను కేటాయించింది. విద్యార్థుల సంఖ్య 120 నుంచి 200 వరకు ఉంటే కేవలం ఐదుగురు టీచర్లను మాత్రమే కేటాయించింది. విద్యార్థుల సంఖ్య 150కు మించితే ప్రధానోపాధ్యాయులతోపాటు ఐదుగురు టీచర్లు ఉండాలని పేర్కొంది. 200 దాటితే ఉపాధ్యాయ నిష్పత్తి ప్రకారం భర్తీ చేయాలని తెలిపింది. 6 నుంచి 8వ తరగతి వరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రతి తరగతికి సైన్స్, మేథ్స్, సోషల్ స్టడీస్, ల్యాంగ్వేజ్ టీచర్ ఉండాలని పేర్కొంది. ప్రతి 35 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలని తెలిపింది. విద్యార్థుల సంఖ్య 75లోపు ఉన్న ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, పిఇటి కాకుండా ఆరుగురు టీచర్లు ఉండాలి. విద్యార్థుల సంఖ్య 200లోపు ఉంటే ప్రధానోపాధ్యాయులు, పిఇటితో కలిపి 9 మంది టీచర్లు ఉండాలి. విద్యార్థుల సంఖ్య 200 దాటిన ప్రతి ఉన్నత పాఠశాలలోనూ ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను కేటాయించింది.

మాజీ ఎంపీ సహా 10 మందికి జైలు

కన్నౌజ్ : ఉత్తరప్రదేశ్‌లో మాజీ ఎంపీ రామ్ బక్ష్ వర్మ సహా పది మందికి కోర్టు జైలు శిక్ష విధించింది. 2017లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులో ఒక్కొక్కరికీ ఏడాది జైలు శిక్షతోపాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఎంపి, ఎంఎల్ఎ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ దర్శన్ సింగ్ తీర్పు చెప్పారు. జైలు శిక్ష పడిన వారిలో మాజీ ఎంపి తనయుడు సైతం ఉన్నారు. మాజీ ఎంపీ రామ్ బక్ష్ వర్మ గతంలో రెండు పర్యాయాలు (1994, 2006) రాజ్యసభకు నామినేట్ అయ్యారు. 2017లో నిర్వహించిన ఊరేగింపులో వర్మ మద్దతుదారులు పోలీసులతో గొడవపడటంతో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ వర్మ మరికొందరిపై 2017 జనవరి 25న తిర్వా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో వర్మ సహా పది మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. వర్మ ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీలో ఉన్నారు.

వివక్షకు తావే లేదు !

- అమెరికాలో మీడియాతో ప్రధాని మోడీ
- ముగిసిన నాలుగు రోజుల పర్యటన


మీడియాతో మాట్లాడుతున్న మోడి

వాషింగ్టన్ : ప్రధాని నరేంద్ర మోడీ నాలుగు రోజుల పర్యటన ముగింపు సందర్భంగా గురువారం రాత్రి ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, భారతదేశంలో మైనార్టీలపై వివక్ష తావే లేదని అన్నారు. భారత్‌లో మైనార్టీల హక్కులు మెరుగుపరచడానికి, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న ప్రశ్నకు జవాబివ్వకుండా ఆయన దాటవేశారు. మోడీ ప్రధాని అయిన తరువాత ఈ తొమ్మిదేళ్లలో భారత గడ్డపై ఒక్క ప్రెస్ కాన్ఫరెన్స్ కూడా నిర్వహించలేదు. అమెరికా గడ్డపై మీడియాతో మాట్లాడినప్పుడు అక్కడి విలేకరులు అడిగిన కొన్ని ప్రశ్నలకు సమాధానమివ్వడానికి నిరాకరించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం, మానవ హక్కుల ఉల్లంఘనలు, ముస్లింలపై వేధింపులు గురించి వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరి ప్రశ్నించారు. దానిపై మోడీ స్పందిస్తూ, 'ఎవరో అంటున్నారని మీరనడం నాకు ఆశ్చర్యంగా ఉంది. భారత్ ప్రజాస్వామ్య దేశం, భారత్, అమెరికా రెండింటి డిఎన్ఎల్లోనే ప్రజాస్వామ్య భావన వుంది.' అన్న బైడెన్ వ్యాఖ్యలను ఉటంకించారు. మానవ హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి మోడి మాట్లాడుతూ, "భారత్‌లో ప్రజాస్వామ్య విలువల్లో ఎలాంటి వివక్ష లేదు. మతం లేదా కులం ప్రాతిపదికన లేదా వయస్సు, ఇతర అంశాల ప్రాతిపదికన వివక్ష అనేది లేదని చెప్పారు.

మోడీతో బైడెన్ బంధాన్ని పశ్చిమ దేశాల మీడియా ఎలా చూసింది?

అధికారంలోకి వచ్చినప్పటి నుండి మోడీ, ఆయన ప్రభుత్వం మీడియాను ఎలా నియంత్రిస్తూ వస్తోందో న్యూయార్క్ టైమ్స్ ప్రస్తావించింది. ఎలాంటి తప్పులు ఎప్పుడూ చేయలేదంటూ మోడీ వచ్చే వద్దే తిరస్కరిస్తూనే వుంటారు. భారత్‌లో మానవ హక్కుల మిగతా 5లో

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్



- నలుగురు ఉగ్రవాదులు మృతి

•లోపలి పేజీలో•

టోఫెల్ పరీక్షలపై ఇటిఎస్‌తో ఎంఒయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు టోఫెల్ పరీక్షల నిర్వహణ కోసం ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ (ఇటిఎస్)తో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సిఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఎంఒయుపై రాష్ట్ర ప్రభుత్వం తరపున సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు, ఇటిఎస్ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ లిజోసమ్ సంతకాలు చేశారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసే వారి కుటుంబాలకు గొప్ప సేవ చేసినట్లేనని సిఎం పేర్కొన్నారు. తరగతి గదులను డిజిటలైజ్ చేయబోతున్నామని, విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశామని అన్నారు. టోఫెల్ శిక్షణ కేవలం జూనియర్ లెవెల్‌తో పరిమితం కాకుండా ఫ్యూచర్ ప్లస్ కోర్, టూ సీనియర్ లెవెల్ వరకూ విస్తరించాలని తెలిపారు. ఈ కార్యక్రమం ఏపీ విద్యారంగం స్వరూపాన్ని మారుస్తుందని ఇటిఎస్ సీనియర్ డైరెక్టర్ అలెన్ డౌమస్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ నిధిమీనా, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, ఇటిఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హామీతో సరి!

- నేటికీ అందని రూ.5 లక్షల పరిహారం
- పోలవరం నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం


రేపాకలోని ముంపునకు గురవుతున్న భూములు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వస్తే 2006లో సేకరించిన భూమికి పోలవరం నిర్వాసితులకు ఎకరాకు ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో, నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల ముందు పోలవరం ముంపు ప్రాంతాల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. 2006లో సేకరించిన భూములకు పరిహారం తక్కువగా ఇచ్చారని, ఎకరా ఒక్కింటికీ కొన్ని గ్రామాల్లో రూ.1.15 లక్షలు, మరికొన్ని గ్రామాల్లో రూ.1.30 లక్షలు, ఇంకొన్ని గ్రామాల్లో రూ.1.45 లక్షల చొప్పున ఇచ్చారన్నారు. అందరికీ ఒకే మాదిరిగా ఎకరాకు ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని గత ఎన్నికల ముందు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీని ప్రకారం గతంలో ఇచ్చిన మొత్తాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని నిర్వాసితులకు ఇవ్వాల్సి ఉన్నా, ఇది నేటికీ అమలుకు నోచుకోలేదు. పోలవరం ప్రాజెక్టు పనులకు 2005లో పునాది పడింది. ఈ ప్రాజెక్టు వల్ల 116 గ్రామాలకు చెందిన 20,946 కుటుంబాలు ముంపునకు గురవుతాయని అధికారులు లెక్కలు కట్టారు. పోలవరం నిర్వాసిత కుటుంబాల్లో ఆందోళన వెంటాడుతోంది. గత ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పసిగట్టి నిర్వాసితుల్లో ఆశలు కల్పించారు. పునరావాసం భూ పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలను పూర్తిగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయలేదు. గోదావరి వరదల సమయంలో సైతం బాధితులను మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ పట్టించుకోవడం లేదు. తాజాగా పరిహారం పేరుతో ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. ఇది కంటి తుడుపు సర్వే అని పోలవరం నిర్వాసితులతోపాటు వివిధ రాజకీయ పార్టీలు, నాయకులు అభిప్రాయపడుతున్నారు.

5 లక్షల పరిహారం అందలేదు

నాకు ఏడెకరాల భూమి ఉంది. మినుములు, వరి సాగు చేసే వాడిని. మూడు ఎకరాల భూమికి ఎకరా ఒక్కంటికీ రూ.1.15 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. రెండు ఎకరాల భూమి ఇస్తామన్నారు. కానీ ఇప్పటికీ ఇవ్వలేదు. ఎకరాకు ఐదు లక్షల ఇస్తామని చెప్పడంతో మిగిలిన సొమ్ము కోసం ఆశగా ఎదురుచూస్తున్నాను. తాతముత్తాతల కాలం నుంచి సాగు చేసిన భూమిని ప్రాజెక్టు కోసం ఇచ్చాము. ప్రభుత్వం మా పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

\- పాయం సత్యనారాయణ, పెద ఆర్కూరు, కూనవరం మండలం

భూములిచ్చాం... సాగుకూ లేవు

పరిహారంగా రావల్సినపెలో భూమిచ్చారు. అది సాగుకు అనుకూలంగా లేనప్పటికీ ప్రభుత్వం చెద్దామని వెళ్లాం. ఇక్కడ ఆ భూ యజమాని తనకు ఇంకా ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదని, ఈ భూమిని సాగు చేయనివ్వలేదని అడ్డుకున్నారు. భూ పట్టాలైతే ఇచ్చారు. భూమి దక్కలేదు. గతేడాది వరదలకు ఆ భూమి కూడా ముంపునకు గురైంది. ఇప్పటికైనా న్యాయం చేయాలి. కూనవరం మండలంలో ఉన్న మాకు ఏటపాకలో భూములిచ్చారు. వాటితో మాకు ఫలితం లేదు.

\- ఎం.రామకృష్ణ, బొజ్జరాయిగూడెం, కూనవరం

తెలంగాణలో ఉద్యోగులకు అలవెన్స్ పెంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులకు, పెన్షనర్లకు 2.73 శాతం డిఎ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం తాజాగా వారికి అలవెన్సు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల ప్రకారం శుక్రవారం ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులకు ట్రావెలింగ్ కన్వేయన్స్ 30శాతం, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ 30శాతం, సెలవురోజుల్లో పనిచేసే లిఫ్ట్ ఆపరేటర్లు, డ్రైవర్లకు అదనంగా రూ. 150 చెల్లింపు, షెడ్యూల్ ఏరియాలో పనిచేసే ఉద్యోగులకు స్పెషల్ కాంపెన్సేటరీ అలవెన్స్ 30శాతం, ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే అడ్వాన్స్ పెంపు, కారు కొనుగోలు చేసే వారికి ఇచ్చే అడ్వాన్స్ పరిమితి పెంపు, ఉద్యోగుల పిల్లల వివాహాలకు సంబంధించి అడ్వాన్స్ పరిమితి పెంచుతూ ప్రభుత్వం జీవోలు జారీచేసింది. గ్రేహౌండ్స్, ఇంటెలిజెన్స్, ట్రాఫిక్, సిఐడి, ఆక్టోపస్, యాంటీ నక్సలైట్ స్క్వాడ్ విభాగాల్లో పనిచేసే పోలీసులకు ఇచ్చే స్పెషల్ పే 2020 పే స్కేల్ ప్రకారం వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పెన్షనర్లు మరణిస్తే అంతిమ సంస్కారాలకు అందించే తక్షణ సాయం రూ. 20 వేల నుంచి రూ. 30వేలకు పెంచాలని, ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించే అన్ని విభాగాల్లోని ఉద్యోగులకు అదనంగా 15శాతం స్పెషల్ పే చెల్లిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

విద్యార్థిని ఆత్మహత్య

ఇష్టం లేని కోర్సులో తల్లిదండ్రులు చేర్చడంతో బలవన్మరణం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామ పరిధిలోని ఎస్ఎల్ఎన్ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిని శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం మేరకు... కళ్యాణదుర్గం మండల పరిధిలోని గోళ్ల గ్రామానికి చెందిన సీమ సాధ్య(16) ఈనెల 10న అనంతపురం రూరల్ కక్కలపల్లి గ్రామం పరిధిలోని ఎస్ఎల్ఎన్ జూనియర్ కళాశాలలో బైపిసి గ్రూపులో చేరారు. అక్కడే ఉన్న హాస్టల్‌లో ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 5-30 గంటలకు కళాశాలలోని ల్యాబొరేటరీలోకెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారమిచ్చింది. ఇష్టంలేని గ్రూపులో చేర్చడం వల్లనే ఒత్తిడికి గురై విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్టు బంధువులు చెబుతున్నారు. విద్యార్థిని సాధ్య ఎంపిసి చదవాలనుకుంటే, తల్లిదండ్రుల ఒత్తిడి మేరకు బైపిసి చేర్చడంతో ఆ కోర్సు చదవడం ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడినట్టు బంధువులు చెప్పున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్యపై విద్యార్థి సంఘాలు నిరసన చేపట్టాయి. కళాశాలలో అనుమతిలేకుండా హాస్టల్ నడుపుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సీమసాధ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కెసిఆర్ వ్యాఖ్యలు సరికావు : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణలో ఎకరం విలువ ఆంధ్రప్రదేశ్‌లో వందెకరాలతో సమానం అంటూ సిఎం కెసిఆర్ వాఖ్యలు సరికావని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ముంబయిలో ఎకరం అమ్మితే ఇక్కడ వెయ్యి ఎకరాలు కొనొచ్చని, అమెరికాలో అయితే ఇంకా ఎక్కువ వస్తుందన్నారు. కెసిఆర్ హైదరాబాద్ రేట్లను పట్టుకుని వాఖ్యలు చేయడం తగదన్నారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో విపరీతంగా విద్యుత్ కోతలు వున్నాయని, రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని అన్నారు. కేవలం సాంకేతిక కారణాలతో కొద్ది నిమిషాలు విద్యుత్ పోవడం తప్ప రాష్ట్రంలో ఎక్కడా కోతలు లేవన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్షాలు పనిగట్టుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయన్నారు. విశాఖపట్నం ఎంపి ఎంపిగా వుంటూ వ్యాపారాలు చేయడం సరైందికాదని అంటే దాన్ని కూడా వక్రీకరించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరైనా అధికారం కోసం రాజకీయాలు చేయడం సహజమని, అయితే రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ మాత్రం చంద్రబాబు నాయుడును సిఎం చేసేందుకు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ముద్రగడ పద్మనాభం పార్టీలకు అతీతంగా కాపు ఉద్యమాన్ని నడుపుతున్నారని, అలాంటి వారిని కూడా జనసేన టార్గెట్ చేయడం సరైందికాదన్నారు.

కండిషనల్ క్రమబద్ధీకరణ!

- కాంట్రాక్టు ఉద్యోగులపై సర్కారు సన్నాహాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అయితే ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియలో అనేక నిబంధనలు పెట్టాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో అనేక మంది రెండు దశాబ్దాలకన్నా ముందునుంచే పనిచేస్తున్నారు. ప్రధానంగా 2014 సంవత్సరానికి ముందుగా కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికే క్రమబద్ధీకరణ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగం, వారికి ఉన్న విద్యార్హతలను పరిశీలించి, అందుకు అనుగుణంగా ఉంటేనే క్రమబద్ధీకరించాలని యోచిస్తోంది. ఇది కూడా అనేక మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఇబ్బందికరంగానే మారుతుందని పలువురు అంటున్నారు. చాలామంది ఉద్యోగులు తమ విద్యార్హతలకు భిన్నంగా అనేక పోస్టుల్లో పనిచేస్తున్నారు.

చిరుధాన్యాల సాగుతో ఆర్థిక ప్రయోజనాలు

సిఎసిపి చైర్మన్ విజయ్ పాల్ శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

చిరు ధాన్యాలు సాగు చేసే రైతులకు బంగారు భవిష్యత్తు ఉందని, పుష్కలమైన ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని సిఎసిపి (వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు, ధరల కమిషన్) చైర్మన్ ప్రొఫెసర్ విజయ్‌పాల్ శర్మ అన్నారు. వాటిని పండించే రైతులకు అన్ని విధాలుగా సహకరించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. 2024-25 మార్కెటింగ్ సీజన్ రబీ పంటల ధరల విధాన రూపకల్పనలో భాగంగా విశాఖపట్నం వేదికగా ది పార్కు హోటల్లో వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులు, ధరల కమిషన్ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు శుక్రవారం జరిగింది. సదస్సులో ఎపి, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వ్యవసాయ కమిషన్ల ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. సదస్సులో సిఎసిపి చైర్మన్ విజయ్ పాల్ శర్మ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి పరిస్థితులను భేరీజు వేసుకొని, ఆయా రాష్ట్రాల ప్రయోజనాలను, ప్రతినిధుల డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని ధరలను నిర్ణయించేందుకు కేంద్రానికి సిఫార్సులు చేస్తామని తెలిపారు. రైతులు, రైతు సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, స్థానిక మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నివేదిక రూపొందిస్తామని స్పష్టం చేశారు. సాధారణ పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు మళ్లేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర కృషి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

ప్రధానంగా మిల్లెట్లు పండించే రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, రైతుల తరుపున స్థానిక డిమాండ్లను రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్.నాగిరెడ్డి ధరల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. పంటల సాగులో అవుతున్న ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా మద్దతు ధరలు నిర్ణయించాలని, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మద్దతు ధరలు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. సరైన సమయంలో సరైన విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందని, లేదంటే రైతులు, ప్రజలు విపత్కర పరిస్థితులు ఎదుర్కోక తప్పదని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విజయ్ పాల్ శర్మ

సి2 ప్లస్ 50 శాతం ఎంఎస్‌పిలను సవరించాలి

- సిఎసిపి ఛైర్మన్‌కు ఎపిఎస్‌కెఎం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సూచించిన సి2 ప్లస్ 50 శాతం ఫార్ములా కింద ఎంఎస్‌పిలను తక్షణమే సవరించాలని, లేనిపక్షంలో రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ ఫార్మర్స్ అసోసియేషన్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎపిఎస్‌కెఎం) పేర్కొంది. విశాఖపట్నం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రైతు సంఘాల ప్రతినిధులు కమిషనరు ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్ అండ్ ప్రైజెస్ (సిఎసిపి) ఛైర్మన్ విజయ్‌పాల్ శర్మకు వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎపి రైతు సంఘం జనరల్ సెక్రటరీ కెవివి ప్రసాద్, రైతుకూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, టిఎఫ్‌యు జనరల్ సెక్రటరీ పి జమలయ్య, ఎఐఎకెఎంఎస్ సెక్రటరీ ఎం గిరీశం సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ఈ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, అప్పలనాయుడు అందజేశారు. ఈ మేరకు వడ్డే శోభనాద్రీశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. 7వ వేతన సంఘం క్రమపద్ధతిలో కుటుంబం గౌరవ ప్రదంగా బతకాలంటే నెలకు రూ.18 వేలు జీతం ఉండాలని సిఫార్సు చేస్తే పట్టించుకోలేదని, ఇప్పుడు 8వ వేతన సవరణ సంఘం త్వరలో కొత్తవేతన స్కేళ్లను ప్రకటించే అవకాశముందని లేఖలో పేర్కొన్నారు. 1977 నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం సగటు రైతుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.23 లక్షలు మాత్రమే ఉందని, ద్రవ్యోల్బణం రేటును పరిగణనలోకి తీసుకుంటే సుమారు నెలకు రూ.9 వరకు మాత్రమే వస్తోందన్నారు. ఇందులో 37 శాతం సాగు ద్వారా, 40 శాతం పాడిపరిశ్రమ ద్వారా వచ్చే వేతనంగా పేర్కొనడం జరిగిందని తెలిపారు. వినియోగదారులు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చడానికి ఎంఎస్‌పిలు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్-ఎస్) అంచనా ప్రకారం 1996 నుంచి 2008 వరకు ప్రకటించిన ఎంఎస్‌పిలు వాస్తవ ఉత్పత్తి వ్యయం కంటే 38 శాతం తక్కువగా ఉందని తెలిపారు.

సిఎం హామీ అమలు చేయాలి

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సిఎం వైఎస్ జగన్‌కు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబీరాణి, కె సుబ్బరావమ్మ లేఖ రాశారు. రిటైర్మెంటు బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని కోరారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు కల్పించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతోపాటు బీమా అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలను అవమానించే వైఎస్ఆర్ యాప్‌లో 1, 2, 9 కొత్త వెర్షన్‌ను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కౌలు రైతుపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి

- కౌలు రైతుసంఘం, సిపిఎం, ప్రజాసంఘాల డిమాండ్
- నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి- బాపట్ల

బాపట్ల జిల్లా చుండూరుపల్లిలో దళిత కౌలు రైతు ఎం.సతీష్‌పైనా, ఆయన భార్య రాహేలుపైనా అత్యంత పాశవికంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు డిమాండ్ చేశారు. బాపట్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రజాసంఘాల నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ చుండూరుపల్లికి చెందిన పెత్తందారు అంకమ్మ చౌదరికి, ఆయన సోదరుడికి మధ్య ఉన్న భూ వివాదాన్ని చట్టపరంగా పరిష్కరించాల్సిందిపోయి పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న కౌలు రైతుపైనా, ఆయన భార్యపైనా కత్తులతో దాడి చేయడం, గాయపరచడం చాలా దారుణమన్నారు. కౌలు రైతు సతీష్ భూ యజమానితో రెండేళ్లకు కౌలు అగ్రిమెంట్ చేసుకున్నారని, భూమిలోకి దిగి రెండుసార్లు దుక్కిదున్నినా అభ్యంతరం పెట్టలేదని, మూడోసారి కూలీలను పెట్టుకుని సాగుకు సిద్ధం అవుతున్న తరుణంలో పథకం ప్రకారం దాడికి పాల్పడ్డారని విమర్శించారు. కుట్రపూరితంగా సతీష్‌పై హత్యాయత్నం చేసిన అంకమ్మ చౌదరి, ఆయన భార్య సుజాత, కుమారుడు దినేష్, మరో ఇద్దరిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, రౌడీషీట్, బైండోవర్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. అంకమ్మ చౌదరి గతంలో ఓ కౌలుదారుడిపై ఇలాగే దాడి చేసి పంటను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. ఆ కేసులో బెయిల్ తీసుకొని బయట తిరుగుతూ తాజాగా మరో కౌలు రైతుపై దాడి చేయడం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడమేనని పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి గాయపడిన వారికి మెరుగైన వైద్యం చేయించాలని, బాధితునికి భూమి కొనుగోలు పథకం కింద ఎకరం భూమి ఇవ్వాలని, కౌలు రైతు కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలు వ్యవసాయానికి అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ బాధితులను జిల్లా ఎస్‌పి, కలెక్టర్ పరామర్శించి వారిలో ధైర్యం కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్, సిహెచ్.ముజుందార్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, బిఎస్‌పి నియోజకవర్గ ఇన్చార్జి విజయ్‌కుమార్ ఉన్నారు. కాగా, నిందితులపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



అవార్డు అందజేస్తున్న కె.గడ్డెన్న చిత్రంలో ఖాజావలీ, సురేష్

ఈనాడు ప్రతినిధి దుర్గాప్రసాద్‌కు ఎంహెచ్ అవార్డు బహూకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈనాడు స్టేట్ బ్యూరో ప్రతినిధి బొమ్మరాజు దుర్గాప్రసాద్‌కు ప్రజాశక్తి సాహితీ సంస్థ తరుపున మోటూరు హనుమంతరావు రాష్ట్రస్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డును బహూకరించారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందన నిర్వాహక కమిటీ సభ్యులు కె.గడ్డెన్న అవార్డు, జ్ఞాపికను దుర్గాప్రసాదుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఈ నెల 20వ తేదీనే బహూకరించాల్సి ఉన్నా అనివార్య కారణాల వల్ల శుక్రవారం దుర్గాప్రసాదుకు అందజేశారు. రాయలసీమ ప్రాంతంలో కర్నూలు, అనంతపురం జిలాల్లో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఉపాధి కోసం వలస వెళుతున్న నేపథ్యంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజల పడుతున్న ఇబ్బందులను అధ్యయనం చేసి 'ఊరు వలస పోతోంది' శీర్షికతో రాసిన కథనాన్ని ఉత్తమ కథనంగా ఎంహెచ్ అవార్డుల కమిటీ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పలువురు తోటి జర్నలిస్టులు దుర్గాప్రసాదును అభినందించారు. తన పుట్టినరోజునాడే ఉత్తమ జర్నలిస్టు అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉందని దుర్గాప్రసాదు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈనాడు స్టేట్ బ్యూరో చీఫ్ కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు షేక్ ఖాజావలీ, ప్రజాశక్తి బ్యూరోచీఫ్ వి.సురేష్ తదితరులు ఉన్నారు.

'సురక్ష' పేరుతో జగన్ కొత్తవేషం : నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాగ్రహం నుంచి తనను, తన పార్టీని, ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి సిఎం జగన్ 'సురక్ష' పేరుతో కొత్తవేషం కట్టారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి నేతలు, కార్యకర్తల రక్షణ కోసమే సురక్ష కార్యక్రమం అని, ప్రజల రక్షణ కోసం కాదని విమర్శించారు. గడపగడపకు మన ప్రభుత్వాన్ని ప్రజలు ఛీకొట్టడంతో ఈ కార్యక్రమం చేపట్టారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రజలు ప్రభుత్వం, సిఎంపై తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారని తెలిపారు. ల్యాండ్, శాండ్, మైన్, వైన్, నీరు, గాలి దేనినీ వదలకుండా జగన్ అండ్‌కో దోచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అరాచకాలు, దుర్మార్గాలకు అంతేలేకుండా పోయిందని పేర్కొన్నారు. జగన్ కొత్త ఎత్తుల్ని ప్రజలు పసిగడుతున్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

శ్రీవాణి సొమ్ము పక్కదారి : బోండా ఉమా

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఏర్పాటు చేసిన శ్రీవాణి ట్రస్టుకు యాత్రికులు ఇచ్చే సొమ్ము వైసిపి ప్రభుత్వం వచ్చాక పక్కదారి పడుతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. రూ.300, రూ.500 టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న టిటిడి రూ.10 వేల టిక్కెట్లను నేరుగా నగదు చెల్లింపులకు అమ్మడం ఏమిటని ప్రశ్నించారు. టిటిడి నిధుల వ్యయం, యాత్రికులు ఇచ్చే విరాళాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థలతో తక్షణమే సిఎం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై 30న ధర్నాలు

జయప్రదం చేయాలని సిపిఐ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఈ నెల 30న జరగనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గం పిలుపునిచ్చింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం విజయవాడలోని దాసరి భవన్‌లో శుక్రవారం జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. జగన్ అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. దాదాపు రూ.50 వేల కోట్ల మేర గుదిబండను ప్రజలపై మోపారని విమర్శించారు. స్మార్ట్‌మీటర్ల పేరుతో మరో రూ.17 వేలకోట్ల భారాన్ని మోపేందుకు సిద్ధమయ్యారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను వైసిపి ప్రభుత్వం ఉత్సాహంతో వేగవంతంగా అమలు చేస్తోందని విమర్శించారు. సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలను వీరబాదుడు బాదుతున్నారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాటలు, కుట్రలు కట్టిపెట్టాలని, 16 ఏళ్లుగా నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తిచేయాలని, నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యాన ఈ నెల 26న పోలవరంలో జరగనున్న బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు.



దీక్షల్లో కూర్చున్న విద్యార్థులు, ఉక్కు కార్మికులు

'ఉక్కు' పోరాటానికి విద్యార్థుల సంఘీభావం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి అన్ని తరగతుల నుంచీ మద్దతు లభిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 862వ రోజుకు చేరుకున్నాయి. తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకర్తలు, గుంటూరులోని కెఎల్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తరలివచ్చి దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకుంటామని నినదించారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి మాట్లాడుతూ.. ఉక్కు కర్మాగారంపై రాజకీయ పార్టీలు అవలంబిస్తోన్న ద్వంద్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మిగిలిన ఒకే ఒక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారమని, దీనిని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యతని అన్నారు. రాజకీయ పార్టీలు చొరవ తీసుకొని విశాఖ ఉక్కును కాపాడటానికి ముందుకు తరలిరావాలని కోరారు. ప్లాంట్‌ను కాపాడుకోలేకపోతే భవిష్యత్తులో యువత ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యార్థి నాయకుడు అమృతరావు మాట్లాడుతూ.. తామంతా ఉక్కు పోరాటంలో కలిసొస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, వీరాస్వామి పాల్గొన్నారు.

తాడేపల్లికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర కార్యాలయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాన్ని జులై 1 నుంచి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కెఎస్ఆర్ పార్కు రోడ్డు, వార్డు నెంబరు 2, వి స్క్వేర్ బిల్డింగ్‌లోకి మారుస్తున్నట్లు రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ అండ్ కమిషనరు వి రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు ఎన్‌టిఆర్ జిల్లా ఈడ్పుగల్లులోని ఆర్‌కె స్ప్రింగ్ వ్యాలీ అపార్టుమెంట్లో ఉందన్నారు. ప్రజలు, పనుల నిమిత్తం వచ్చేవారు కార్యాలయ మార్పును గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'శ్రీవాణి' నిధులపై టిటిడి శ్వేతపత్రం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు (శ్రీవాణి) నిధులపై టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డితో కలిసి శ్వేతపత్రం విడుదల చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ... టిటిడి బోర్డు తీర్మానం నంబర్ 388 ప్రకారం సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా పురాతన దేవాలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాలు, చిన్న ఆలయాల (భజనమందిరాలు) నిర్మాణానికి తోడ్పాటును అందించే ప్రధాన లక్ష్యంతో 2018, ఆగస్టు 28న శ్రీవాణి ట్రస్టు ఏర్పాటైంది. అదే విధంగా 2019 సెప్టెంబర్ 23న బోర్డు తీర్మానం 23 ప్రకారం ఈ ట్రస్టుకు రూ.10వేలు విరాళం ఇచ్చిన దాతలకు ఒకసారి విఐపి బ్రేక్ దర్శనం కల్పించాలని టిటిడి నిర్ణయించింది. అప్పటినుండి ట్రస్టు వాస్తవ కార్యాచరణ ప్రారంభమైంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మత్స్యకార కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి గాను టిటిడి చేపట్టిన ఈ కార్యక్రమానికి నిధులు వెల్లువెత్తాయి. ఈ ఏడాది మే 31వ వరకు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శ్రీవారికి రూ.860 కోట్లకు పైగా విరాళాలు అందాయి.

శ్రీవాణి ట్రస్టు ద్వారా 8.25 లక్షల మంది యాత్రికులు శ్రీవారిని దర్శించుకున్నారు. 176 పురాతన ఆలయాల పునరుద్ధరణకు రూ.93 కోట్లు మంజూరు చేశాం. వెనుకబడిన ప్రాంతాల్లో ఒక్కొక్కటి రూ.10 లక్షల వ్యయంతో మొత్తం 2,273 ఆలయాల నిర్మాణానికి ఆమోదం తెలిపాయి. వీటిలో 1953 ఆలయాలను ఎపి దేవాదాయ శాఖ, 320 ఆలయాలను సమరసత సేవ ఫౌండేషన్ నిర్మిస్తాయి అని వివరించారు. శ్రీవాణి నిధుల వినియోగంపై సందేహాలను నివృత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ఆరోపణలను నమ్మవద్దని యాత్రికులకు విజ్ఞప్తి చేశారు. ఇఒ ఎవి.ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు నిధుల వ్యవహారంపై కొందరు పీఠాధిపతులు, విహెచ్‌పి నేతలు తనను కలిసినప్పుడు అన్ని పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బ్యాలెన్స్ మొత్తం వివరాలు చూపానన్నారు. నిరాధార ఆరోపణలు చేసే ముందు లక్షలాది మంది యాత్రికుల మనోభావాలు దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

20న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి

జులై 25 నుంచి దశలవారీ పోరాటం

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, ఎన్ఎంఆర్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంటు, సిపిఎస్ రద్దు వంటి డిమాండ్ల సాధన కోసం జులై నెలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పేర్కొంది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణను వెల్లడించారు. జులై 5లోగా ప్రాంతీయ సదస్సులు, 15లోగా జిల్లా సదస్సు, మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సామూహిక రాయభారాలు, 20న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి, 25 నుంచి దశలవారీ పోరాటాలు, 28, 29 తేదీల్లో దీక్షలు, ఆగస్టు 1న చలో కలెక్టరేట్, ఆగస్టు 17న చలో విజయవాడ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె నాగభూషణం, ఎన్‌వై నాయుడు, టి నూకరాజు, కార్యదర్శులు బి ముత్యాలరావు, యు రాజు, కోశాధికారి ఎస్ జ్యోతి, దనాల వెంకటరావు, గార్లపాటి లక్ష్మి, రత్నమ్మ, బి వరలక్ష్మి పాల్గొన్నారు.

900 మందికి ఉద్యోగాలు

- ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ముగిసిన మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 900 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ముగింపు సభలో పలువురికి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ కృషి, పట్టుదల, నిరంతర శ్రమ, సృజనాత్మకతలే విజయ సోపానాలని తెలిపారు. ఇప్పుడు ఉద్యోగం సాధించని వారు నిరుత్సాహపడకుండా మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా వర్సిటీ పరిశ్రమిస్తోందని, భవిష్యత్తులో ప్రతి ఏడాదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. వర్సిటీలో చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. చెన్నైకు చెందిన సిటిజన్ ఫర్ చేంజ్ ఇంటర్ నేషనల్ సీనియర్ డైరెక్టర్ అయ్యలరెడ్డి కిరణ్‌బాబు వందకు పైగా కంపెనీలను విశ్వవిద్యాలయానికి చేరువ చేయడంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్‌మూర్తి, ప్రిన్సిపాళ్లు, పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న విసి రాజశేఖర్

సమగ్ర శిక్ష, కెజిబివిల్లో నియామకాల నోటిఫికేషన్లు రద్దు చేయాలి

- ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమగ్ర శిక్ష, కెజిబివిల్లో నియామకాల కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, తెలుగు, ఇంగ్లీషు పిజిటిలను గెస్ట్ పిజిటి, సిఆర్‌టిలను యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి సమగ్ర శిక్ష, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం బాలకాశి డిమాండ్ చేశారు. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోక్యం చేసుకుని మహిళా ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ప్రభుత్వం ఎస్ఎస్ఎలో 1500 కాంట్రాక్టు ఖాళీ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇప్పటికే కెజిబివిల్లో పనిచేస్తున్న 240 మంది తెలుగు, ఇంగ్లీషు పోస్టులను, 600 మంది గెస్ట్ పిజిటి, సిఆర్‌టిలను తొలగించి వారి స్థానంలో నూతన నియామకాలు చేపట్టడం అన్యాయమన్నారు. ఈ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల జోక్యం ఉన్న నేపథ్యంలో తక్షణమే నోటిఫికేషన్ రద్దు చేయాలని బాలకాశి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె విజయ్, స్వర్ణకుమారి, వై సైధాని, వరలక్ష్మి, మీనా కుమారి, లలితా కుమారి పాల్గొన్నారు.

ఉమ్మడి సీనియార్టీ ప్రకారం డిప్యూటీ డిఇఒ పోస్టుల భర్తీ

- ఫ్యాప్టో డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియార్టీ ఆధారంగానే డిప్యూటీ డిఇఒ పోస్టులను భర్తీ చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ వ్యత్యాసాన్ని చూపి డిప్యూటీ డిఇఒ పోస్టుల్లో ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన ప్రమోషన్లు ఇవ్వడానికి పలు ఆటంకాలు సృష్టిస్తున్నారని తెలిపారు. 2017లో ప్రభుత్వం జారీ చేసిన 73, 74 జిఒలకు అనుగుణంగా ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. ఈ అంశంపై ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిస్తే చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా, ఉమ్మడి సీనియార్టీకి భిన్నంగా ఒకే మేనేజ్‌మెంట్ వారితో పోస్టులను భర్తీ చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

మోడీ, జగన్‌లకు పాలించే హక్కులేదు

జులై 4లోపు పోలవరం నిర్వాసితులకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందే

పోలవరం పోరుకేక మహా పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం

పోలవరం నిర్వాసితుల హక్కులను కాలరాస్తోన్న కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలకు పాలించే హక్కు లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారానికి చేపట్టిన పోరుకేక మహా పాదయాత్ర నాలుగో రోజైన శుక్రవారం కూనవరం మండలం కూటూరు నుంచి ప్రారంభమైంది. రెడ్ షర్ట్ వలంటీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నాల్గో రోజు యాత్రలో భాగంగా లింగాపురం, రేగులపాడులలో సభలు నిర్వహించారు. ఈ సభలకు కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అధ్యక్షత వహించారు. ఆయా సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విభజన చట్టాన్ని తుంగలో తొక్కి రాష్ట్రానికి మొండిచేయి చూపించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం, పునరావాసం విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రశ్నించాల్సిన రాష్ట్ర పాలకులు ఇక్కడ వెర్రి కేకలు వేస్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. దమ్ముంటే మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. పోలవరం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గాలను ప్రజలకు తెలియచేసే సమయం ఆసన్నమైందని తెలిపారు. జులై 4న విజయవాడలో జరిగే మహా ధర్నాకు ప్రతి గ్రామం నుంచి నిర్వాసితులు పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల ముందు పోలవరం నిర్వాసితులకు నాటి ప్రతిపక్ష నేత జగన్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. వీటిని అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. జులై 4లోపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అభిచర్ల గ్రామంలో జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఓ భారీ ప్రాజెక్టు నిర్వాసితుల క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసం కల్పించే పద్ధతి ఇదేనా? అని ప్రశ్నించారు. వందల సంవత్సరాల నుంచి ఆదివాసీలు ఇక్కడే నివసిస్తున్నారన్నారు. గిరిజన చట్టాలను సైతం తుంగలో తొక్కి మోడీ ప్రభుత్వం ప్రవర్తిస్తోందని విమర్శించారు. లింగాపురంలో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ జులై 4న జరిగే ధర్నాకు పోలవరం నిర్వాసితులు గోదారి తరంగాలవలె కదిలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వాణిశ్రీ మాట్లాడారు.







కొమరం లక్ష్మీనారాయణ స్తూపం వద్ద నివాళ్లర్పిస్తున్న శ్రీనివాసరావు, మంతెన సీతారాం, కిరణ్ తదితరులు

అమరవీరులకు నివాళులర్పిస్తూ..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం విలేకరి

పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక మహా పాదయాత్ర అద్యంతం ప్రజల అభిమానాన్ని చూరగొంటోంది. ఆదివాసీల హక్కుల కోసం సిపిఎం గతంలో అనేక పోరాటాలు నిర్వహించిన విషయం విదితమే. ఈ పోరాటాల ఫలితంగానే రూపుదిద్దుకున్న చట్టాలు గిరిజనులకు రక్షణ గోడలుగా నిలిచాయి. ఆ చట్టాల కోసం, వాటి అమలు కోసం నిర్వహించిన పోరాటాలలో అసువులు బాసిన క్షేత్ర స్థాయి నాయకులకు నివాళులర్పిస్తూ యాత్ర ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఎటపాక, కూనవరం మండలాలలో పలువురి అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించారు. ఎటపాక మండలంలో కందుల శ్రీనివాసరావు, బి.సుధబాబు, కాక జోగారావు స్తూపాల వద్ద పాదయాత్ర బృందం నివాళ్లర్పించింది. అదే మండలంలో అమరులైన ఇరపా శ్రీరాములు, తాటిబోయిన రాఘవులు, డి.వెంకటరావు, బండారు సూర్యనారాయణ, పూనెం వెంకటేష్, గుండి వెంకటరావు, కుంజా నర్సయ్యలను స్మరించుకున్నారు. కూనవరం మండలం పల్లూరు గ్రామంలో ఆవుల నాగమయ్య, పెద ఆర్కూర్ గ్రామంలో పాయం సీతమ్మ, అభిచర్ల గ్రామంలో కొమరం లక్ష్మీనారాయణ, టేకులబోరులో పూనెం ముత్తయ్య, రేగులపాడులో పైదా తమ్మయ్య, ముల్లూరులో పైదా లాలయ్య, అయ్యావారిగూడెంలో పైదా గంగయ్య, టేకులబోరులో గర్నేటి సుబ్బారావు స్మారక స్తూపాల వద్ద ఘన నివాళ్లర్పించారు.

కదం తొక్కుతూ... పదం పాడుతూ...

ఉత్సాహంగా సాగుతున్న పోలవరం పోరుకేక మహా పాదయాత్ర



కొమ్మూరు వద్ద పాదయాత్ర బృందానికి స్వాగతం పలికేందుకు వచ్చిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలంటూ సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర నాలుగో రోజు కూనవరం మండలంలోని కూటూరులో ఘనంగా ప్రారంభమై పరిసర గ్రామాల్లో ఉత్సాహంగా సాగింది. కదం తొక్కుతూ... పదం పాడుతూ... గిరిజన యువతీయువకులు అత్యధిక సంఖ్యలో భాగస్వాములయ్యారు. ఈ మహా పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అగ్రభాగాన నిలిచి పోలవరం నిర్వాసితుల పోరాటాన్ని ముందుకు నడిపారు. ఈ నెల 20న ఎటపాక మండలం నెల్లిపాకలో ప్రారంభమైన ఈ మహా పాదయాత్ర శుక్రవారం నాటికి 80 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. భానుని భగభగలు, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉరికే ఉత్సాహంతో నిర్వాసితులు ఈ పాదయాత్రలో కదులుతున్నారు. కూటూరు నుంచి బయలుదేరిన మహా పాదయాత్ర ముల్లూరు, అభిచర్ల, లింగాపురం మీదుగా రేగులపాడుకు చేరుకుంది. అభిచర్ల గ్రామంలో ఆదివాసీలు హారతులతో స్వాగతం పలికారు. మహా పాదయాత్రలో పాల్గొన్న వారికి అంబలి పంపిణీ చేసి దాహార్తి తీర్చారు. అక్కడ సమావేశం అనంతరం పాదయాత్ర అభిచర్ల గ్రామస్తులను కలుపుకుంటూ ముందుకు సాగింది. లింగాపురంలో ఆదివాసీలు విల్లంబులు, కొమ్ముబూరలను నాయకులకు అందించారు. నేతలు వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ఎక్కు పెట్టారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. స్థానిక మహిళ మిడియం రాములమ్మ మాట్లాడుతూ గతేడాది వచ్చిన వరదలలో కొండలపైకి వెళ్లి గుడారాలు ఏర్పాటు చేసుకొని ఆశ్రయం పొందామని తెలిపారు. 45.72 కాంటూరు పరిధిలో ఉందని చెప్తున్న తమ గ్రామం గోదావరికి 37 అడుగులకే మునిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ సమావేశం అనంతరం గ్రామస్తులను కలుపుకొని మహా పాదయాత్ర కొనసాగింది. మధ్యాహ్నానికి రేగులపాడు చేరుకుంది. భోజన విరామ అనంతరం కోడేరు, రాయిగూడెం మీదుగా బొజ్జరాయిగూడెం చేరింది. పాదయాత్రలో పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ప్రజాప్రతినిధులు ప్రదీప్ కుమార్, పులి సంతోష్ కుమార్, వెంకమ్మ, నాగమణి, అమ్మాజీ, కారం లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య సతీమణి చుక్కమ్మ, నాయకులు నాగమ్మ పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన కళా ప్రదర్శనలు



ఆకట్టుకుంటున్న ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం

పోలవరం నిర్వాసితుల హక్కుల సాధనకు సిపిఎం చేపట్టిన పోరుకేక మహా పాదయాత్ర ఉత్సాహంగా సాగుతోంది. ఈ నెల 20న ఎటపాక మండలం నెల్లిపాకలో ప్రారంభమైన ఈ యాత్ర శుక్రవారానికి ఎటపాక, కూనవరం మండలాల్లో ముగిసింది. ఆ యాత్ర ఆద్యంతం ప్రజానాట్య మండలి కళాకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరులను ఎండగడుతూ కళా ప్రదర్శనలు ఇస్తున్నారు. 'గోదారమ్మ నీటి మువ్వలం, రేలా పాటల పూల కొమ్మలం.. మమ్మల్ని ముంచగ చూస్తే పదును ఈటెలం' అంటూ ప్రదర్శించి నృత్య రూపకం నిర్వాసితుల ప్రస్తుత స్థితికి అద్దం పట్టింది. వారిని భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధం చేసింది. జైజైజై ఎర్ర జెండా అంటూ సాగిన మరోపాట అందరినీ కదిలించింది. యాత్రలో 22 మంది ప్రజానాట్య మండలి సభ్యులు భాగస్వాములయ్యారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్, పాదయాత్ర కల్చరల్ టీమ్ కన్వీనర్ ఐ.వెంకటేశ్వరావు కళా రూపాలను పర్యవేక్షిస్తున్నారు. డప్పు నృత్యం, డ్యాన్సులు, పాటలు, రేలా నృత్యాలు, డోలు నృత్యాలు పాదయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా రేలా నృత్యాలకు డిజె జోడించడంతో మరింత ఉత్సాహం నెలకొంది.

ప్రజల నుంచి విశేష ఆదరణ

రోజురోజుకూ ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. యాత్రలో పాల్గొనే వారి కోసం ఆయా గ్రామాల ప్రజలే నిధులు సమకూరుస్తున్నారు.

భోజనాలు ఏర్పాటు చేయడంతోపాటు వంటా వార్పులో భాగస్వాములవుతున్నారు. రాత్రివేళ పాదయాత్ర బృందానికి తమ ఇళ్లలో విడిది ఏర్పాటు చేస్తున్నారు.

ఎస్‌సి గురుకులాల్లో 75.17 శాతం ఉత్తీర్ణత



మేరుగ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో ఎస్‌సి గురుకులాల విద్యార్థులు 75.17 శాతం ఉత్తీర్ణత సాధించారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. 2,674 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 2,010 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఈ ఫలితాలతో కలిసి ఎస్‌సి గురుకులాల విద్యార్థులు 94.97 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలపై స్టే పొడిగింపు

• అధికారులు కౌంటర్ దాఖలుకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

కృష్ణా జిల్లా పరిధిలోని పోలవరం కుడి కాలువ రక్షణ గట్టు నుంచి గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారనే అభియోగాలపై వివరణ ఇవ్వాలని జలవనరుల శాఖను హైకోర్టు ఆదేశించింది. అధికారులు ఎంత విస్తీర్ణంలో తవ్వకాలకు అనుమతిచ్చారో, ఎంత మేరకు తవ్వకాలు చేశారో, ఇంకెంత తవ్వకాలు చేయాలో వంటి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంది. అక్రమ తవ్వకాల వల్ల కాలువ గట్టు బలహీనపడుతుందని పేర్కొంటూ గన్నవరం మండలం, కేసరపల్లికి చెందిన పిల్లి సురేంద్రబాబు దాఖలు చేసిన పిల్‌ను తాత్కాలిక చీఫ్ జస్టిస్ ఎవి శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. గన్నవరం, విజయవాడ గ్రామీణ, ఆగిరపల్లి మండలాలల పరిధిలో మట్టి తవ్వకాలకు అధికారులే అనుమతిచ్చారని గవర్నమెంట్ స్పెషల్ ప్లీడర్ సుమన్ చెప్పడంతో పైవిధంగా ఆదేశించింది. తదుపరి విచారణ వరకు మట్టి తవ్వ కాలను నిలుపుదల చేస్తూ గతంలోని మధ్యంతర స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ప్రకటించింది. అక్రమ తవ్వకాలను నిరోధించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లకు గతంలోనే హైకోర్టు ఆదేశించింది. తమ ఆదేశాలు అమలు చేయని పక్షంలో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలన్న ఉత్తర్వులకు అనుగుణంగా జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) నారాయణరెడ్డి హైకోర్టుకు హాజరయ్యారు. 45 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని రాయల్టీ చెల్లించి తవ్వి తీసుకెళ్లేందుకు అధికారులు అనుమతిచ్చినట్లు సుమన్ చెప్పారు. అక్రమ తవ్వకాలు కాదని, పిల్‌ను కొట్టేయాలని కోరారు. ఇష్టానుసారంగా మట్టిని తవ్వేస్తున్నారని పిటిషనరు తరపున న్యాయవాది పి మహేశ్వరరావు చెప్పారు. హైకోర్టు ఆదేశించినా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని తెలిపారు. 2 కోట్ల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకాలు జరిగాయన్నారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. తదుపరి విచారణ నుంచి ఇరువురు అధికారులు వ్యక్తిగత హాజరుకానక్కర్లేదని చెప్పింది. పిటిషనర్ ఆరోపణలకు కౌంటర్ దాఖలు చేయాలంది. మట్టిని తరలిస్తున్న వాహనాల నెంబర్లను అధికారులకు పిటిషనరు ఇవ్వాలంది. విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

రాష్ట్రం బాగుండాలంటే జగన్‌ను దింపేయాలి

వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్



అంబాజీపేటలో అభిమానులకు వందనం చేస్తున్న పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి- అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

రాష్ట్రంలో ప్రజలు బాగుండాలంటే జగన్మోహన్‌రెడ్డిని అధికారం నుంచి దింపేయాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం నుంచి అంబాజీపేట మీదుగా పి.గన్నవరం వరకూ ర్యాలీ నిర్వహించారు. పి.గన్నవరం నాలుగు రోడ్ల సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో యువకులు, మహిళలు, విద్యావంతులు పెద్ద ఎత్తున జనసేన పార్టీని బలపరిచి ఆశీర్వదించాలని కోరారు. 'హలో ఎపి బైబై వైసిపి' అంటూ ఉత్సాహపరిచారు. అంతకు ముందు అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో పవన్ సమావేశమయ్యారు. అనంతరం మామిడికుదురు మండలం ఆక్సిజన్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో తయారు చేస్తోన్న కొబ్బరి పీచు బొమ్మలను ఆయన పరిశీలించారు. సంస్థ ప్రతినిధి అడ్డాల గోపాలకృష్ణ ఈ బొమ్మల తయారీ విధానాన్ని పవన్ కల్యాణ్‌కు వివరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కొబ్బరి ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మార్కెట్ సదుపాయం కల్పిస్తే ఎందరో మహిళలకు ఉపాధి దక్కుతుం దన్నారు. కళాత్మకంగా బొమ్మలు తయారు చేస్తున్న మహిళలను అభినందిం చారు. ఆయన వెంట నాయకులు నాదెండ్ల మనోహర్, అసోసియేషన్ అధ్యక్షులు కటికిరెడ్డి గంగాధరం ఉన్నారు.

చిరుత దాడిలో 'కౌశిక్' క్షేమం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల అలిపిరి నడక మార్గంలో చిరుత దాడిలో గాయపడిన బాలుడు కౌశిక్ క్షేమంగా ఉన్నారని టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతి శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఐసియులో చికిత్స పొందుతున్న బాలుడిని శుక్రవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. బాలుడికి ఎలాంటి ప్రమాదమూ లేదని, క్షేమంగా ఉన్నాడని, మరింత మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా రెండు వైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చిరుత ఘటన జరిగిన ప్రదేశాన్ని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి తదితరులు పరిశీలించారు.

తిట్లకు లొంగిపోయే వ్యక్తిని కాను

• పవన్‌కల్యాణ్‌కి ముద్రగడ మరో లేఖ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్(కాకినాడ జిల్లా)

తిట్లకు, బూతు మెసేజ్‌లకు లొంగిపోయే వ్యక్తిని కాదని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పేర్కొన్నారు. 'నీ అభిమానులతో అసభ్యకరమైన రీతిలో మెసెజ్‌లు పెట్టి తిట్టించడం ఎంతవరకు సమంజసం' అని ఆయన పవన్‌కల్యాణ్‌ని ప్రశ్నించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ఆయన నివాసం నుంచి శుక్రవారం పవన్‌కల్యాణ్‌కు మరో లేఖను విడుదల చేశారు. లేఖలో 30 ప్రశ్నలను పవన్‌పై సంధించారు. 'డబ్బు ఉంది కదా అని తిట్టిస్తారా? లేక నాకు చీము, నెత్తురు, పౌరుషం లేక అనాథలా మిగిలిపోయానని అనుకుంటు న్నారా..?' అని పేరొన్నారు.

సంపాదకీయం

అమెరికాలో మోడీ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా పర్యటన సంఘ్ పరివార్, గోడీ మీడియా సంకీర్తలనతో శుక్రవారం ముగిసింది. అమెరికా అధ్యక్షులు జోయ్ బైడెన్ దంపతుల ఆహ్వానం మేరకు శ్వేతసౌధం చేరుకున్న మోడీకి ఘనమైన ఆతిథ్యమే లభించింది. బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. బైడెన్‌కు ఆయన 80 ఏళ్ల జన్మదినోత్సవాన్ని ప్రతిబింబించేలా సహస్ర చంద్ర దర్శన కానుకను, ఆయన భార్య జిల్ బైడెన్‌కు పర్యావరణ కార్యకర్త అని పేరుండటంతో 'పచ్చ' రంగు వజ్రాన్ని మోడీ సమర్పించారు. ఫోటోలు దిగడంలో మక్కువ ఉన్న నేతగా పేరున్న మోడీకి బైడెన్ పురాతన కెమెరాను బహూకరించారు. అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి మోడీ చేసిన ప్రసంగం అసాంతం కట్టుకథలేనన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట. ద్వైపాక్షిక చర్చలు, ఒప్పందాలు జరిగినమాట వాస్తవం. కానీ భారత ప్రజలకు ఒరిగిందేమిటి? రక్షణ రంగంలో స్వీయ సమృద్ధి సాధిస్తున్నామంటూ ఇక్కడ గొప్పలు చెబుతూ అమెరికా రక్షణ కంపెనీలతో కొనుగోళ్ల ఒప్పందాలు చేసుకోవడం దేనికి సంకేతం? నింగి, నేలా సర్వం ప్రయివేటీకరించి కార్పొరేట్ మిత్రులకు దోచిపెడుతున్న మోడీ సర్కార్ అమెరికాతో చేసుకున్న ప్రతి ఒప్పందంలోనూ క్రోనీల మేళ్లు చూసుకుందే తప్ప దానివల్ల దేశానికి పొంచివున్న ముప్పు గురించి పట్టించుకోకపోవడం దారుణం.. టెలికాం, సాంకేతిక, పర్యావరణ, ఆరోగ్య రంగాల్లో చేసుకున్న ఒప్పందాల్లోనూ దేశ ప్రయోజనాల కన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకే మోడీ అధిక ప్రాధాన్యమిచ్చారు. బిఎస్ఎన్ఎల్‌ను చావుదెబ్బ తీసి జియో గుత్తాధిపత్యానికి బాటలు వేసిన మోడీ సర్కార్ , ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చే అమెరికన్ టెలికాం సాంకేతికత వల్ల ప్రయోజనమెవరికో వేరే చెప్పనవసరం లేదు. ఇరుదేశాధినేతల దృష్టిలో బంధం బలోపేతం కావడమంటే అటు అమెరికా కంపెనీలకు, ఇటు భారత క్రోనీలకు లబ్ధి చేకూర్చడమే. గుజరాత్ మారణకాండ నేపథ్యంలో మోడీని తమ గడ్డపై అడుగుకూడా పెట్టనివ్వబోమని ఒకప్పుడు భీష్మించిన శ్వేతసౌధం ఇప్పుడు ఎర్ర తివాచీ పరచి స్వాగత సత్కారాలు ఏర్పాటు చేయడం వెనుక మర్మం ఏమిటి? ఇదంతా మోడీ ఘనతేనని ఆయన భజనపరులు ఆకాశానికెత్తేయడంలో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. మైనార్టీల ప్రాణాలను చిదిమేసి, మానవ హక్కులను కాలరాసిన మతతత్వ నేతకు ఆతిథ్యం ఇవ్వడం సిగ్గుచేటు అంటూ బైడెన్ పార్టీకే చెందిన పలువురు సెనెటర్లు బహిరంగంగానే చీకొట్టారు. ఇదే అంశంపై 70 మంది ప్రజాప్రతినిధులు బైడెన్‌కు లేఖాస్త్రాన్ని సంధించారు. వాస్తవానికి చైనాకు పక్కలో బల్లెంలా సైనిక కూటమిని కూర్పు చేయాలని తహతహలాడుతున్న అమెరికాకు మోడీ పెద్ద వనరుగా కనిపిస్తున్నారు. అందుకే ఇంతటి ఘన సత్కారాలు.

2014లో అధికారంలోకి వచ్చిననాటి నుంచీ భారత్‌లో ఒక్కరోజైనా పాత్రికేయుల సమావేశంలో మాట్లాడేందుకు చేవ చూపలేని మోడీ...శ్వేతసౌధం ఒత్తిళ్లతో మీడియా ముందుకు రాక తప్పలేదు. ది వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్తా సంస్థ ప్రతినిధి అడిగిన ప్రశ్నతో మోడీ బిత్తర చూపులు చూస్తున్నట్టు ఉన్న వీడియో ఒకటి ఆయన భారత్ చేరుకోకముందే విశ్వవ్యాప్తంగా చక్కర్లు కొట్టేస్తోంది. భారత్‌లో పెరిగిపోతున్న మానవ హక్కుల ఉల్లంఘన, మతపరమైన వివక్ష నివారణకు తీసుకున్న చర్యలేమిటి అని సదరు జర్నలిస్టు నిలదీశారు. ఇక భారత్ నుంచి పిటిఐ వార్తాసంస్థ ప్రతినిధి మోడీ మనస్సు కష్టపెట్టకుండా వాతావరణ మార్పులకు సంబంధించిన సాధారణ ప్రశ్నతో సరిపెట్టారు. భారత్, అమెరికా ప్రజాస్వామ్య దేశాలని, ఇరుదేశాల డిఎన్ఎలోనే ప్రజాస్వామ్యం ఇమిడివున్నందన ఏ రూపంలోనూ వివక్షకు తావులేదని మోడీ ఉద్ఘోషించారు. దేశదేశాల్లో యుద్ధోన్మాదాన్ని రాజేస్తూ మానవ హక్కులను కాలరాస్తున్న అమెరికా పంచన మోడీ పలికిన పలుకులు పచ్చి అబద్ధాల మూటగా రాజకీయ విశ్లేషకులు పెదవిరిచారు. పాత్రికేయులు, మానవ హక్కుల కార్యకర్తలు, మైనార్టీలు, ఆదివాసీలను లక్ష్యంగా చేసుకొని యథేచ్ఛగా జరుగుతున్న దాడులు, మైనార్టీలపై గోగూండాల అరాచకాలు నిత్యకృత్యంగా దేశంలో కొనసాగుతుంటే వివక్షకే తావులేదన్నట్టు, ప్రభుత్వం చేయాల్సింది ఏమీ లేదని మోడీ బుకాయించడం సిగ్గుచేటు.

బిజెపి పాలిత మణిపూర్‌లో హింసాగ్ని మంటలు ఎగిసిపడుతుంటే, దాని గురించి కొంచెం కూడా పట్టించుకోకుండా అమెరికాకు పయనమైన మోడీ సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు ఆ రెండే కాదు..చాలానే మిగిలిపోయాయి. నిత్యం ఎగబాకుతున్న నిత్యావసరాల ధరలు, కోరలు చాస్తున్న నిరుద్యోగం, రైతుల కడగండ్లు, ఆడబిడ్డలపై అకృత్యాలు ఇవేవీ మోడీ సర్కార్‌కు మానవ హక్కుల ఉల్లంఘనగా అనిపించలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షాల గొంతు నులుముతూ, రాష్ట్రాల హక్కుల హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని నిత్యం పరిహాసమాడుతుంటే అమెరికా వెళ్లి అంతా బాగుంది అనడం మోడీ ఆత్మవంచనకు పరాకాష్ట. బిజెపి ప్రభుత్వమాడుతున్న ఈ నాటకాలకు తెరదించాల్సిందే. పాట్నా వేదికగా శుక్రవారం జరిగిన ప్రతిపక్షాల భేటీ ఈ దిశగా గొప్ప ముందడుగు.

మహనీయుల మాట



సంపద సముద్రపు నీరు లాంటిది. మనం ఎంత ఎక్కువ తాగితే అంత ఎక్కువ దాహం అవుతుంది.
- ఆర్థర్ స్కోపెన్ హౌర్, జర్మన్ తత్వవేత్త.

విశ్లేషణ

బిజెపి ఎజెండాతో లా కమిషన్

ఏక రూప పౌరస్మృతి గురించి ఆసక్తి ఉన్న వారు నోటిఫికేషన్ జారీ చేసిన జూన్ 14వ తేదీ నుంచి నెల రోజుల్లోగా తమ అభిప్రాయాలను తెలపాలంటూ ఇరవై రెండవ లా కమిషన్ ఒక ప్రకటన చేసింది. అది లేకపోతే దేశం ఇంకేమాత్రం ముందుకు పోదు, తీవ్ర ఆటంకంగా ఉందన్నట్లు కొందరు గుండెలు బాదుకుంటున్నారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నదే కదా, దాన్ని అమలు చేస్తామంటుంటే ఎందుకు లేనిపోని దురుద్దేశాలు అంటగడుతున్నారు–అంటూ అమాయకత్వాన్ని నటిస్తున్నారు. అదే గనుక వాస్తవమైతే నరేంద్రమోడీ తొమ్మిది సంవత్సరాలుగా ఏం చేస్తున్నట్లు? చట్టాన్ని తీసుకువచ్చేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. లా కమిషన్ సరిగ్గా ఇప్పుడు దాన్ని ఎందుకు ముందుకు తీసుకు వచ్చిందన్నది ప్రశ్న.


ఏక రూప పౌరస్మృతి ఈ దశలో అవసరమూ కాదు వాంఛనీయమూ కాదని 2018 ఆగస్టులో ఇరవై ఒకటవ లా కమిషన్ విడుదల చేసిన సంప్రదింపుల పత్రంలో స్పష్టంగా పేర్కొన్నది. ఆ పత్రం విడుదల చేసి మూడు సంవత్సరాలు దాటినందున నాటి నోటిఫికేషన్ గడువు ముగిసిందని, వివిధ కోర్టుల ఉత్తర్వులు దీని మీద ఉన్నందున ఈ అంశం మీద కొత్తగా అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నది. అభిప్రాయాలు తప్ప కోర్టు ఉత్తరువులేమీ లేవు. తాజా సేకరణతో ఏమి చేస్తారో చెప్పలేదు. గత కమిషన్ 2016 జూన్ 17 నోటిఫికేషన్ ద్వారా అభిప్రాయాలను సేకరించింది. వాటిని క్రోడీకరించి కుటుంబ చట్ట సంస్కరణలు పేరుతో 185 పేజీల పత్రాన్ని విడుదల చేసింది. ఏక రూప దేశం అంటే సమరూపత ఉండనవసరం లేదు. మానవ హక్కుల అంశంలో ప్రపంచమంతటా ఉన్న వివాదాలు లేని తర్కాలతో మన భిన్నత్వాన్ని సమ్మతింపచేసేందుకు ప్రయత్నాలు చేయాల్సి ఉందని ఆ పత్రం పేర్కొన్నది. వివిధ మతాలకు సంబంధించి పర్సనల్ చట్టాల్లో ఉన్న వివక్ష, అసమానతలను ఎదుర్కొనేందుకు ఇప్పుడున్న కుటుంబ చట్టాలను అవసరమైన మేరకు క్రోడీకరించి, సవరించవచ్చని కూడా పేర్కొన్నది. సుప్రీం కోర్టు తన ముందుకు వచ్చిన వివిధ కేసుల విచారణ సందర్భంగా ఏకరూప పౌరస్మృతి అవసరమని అభిప్రాయపడింది. తాజాగా మార్చి 23వ తేదీన వివిధ పిటీషన్ల మీద తీర్పు చెబుతూ ఇలాంటి పిటీషన్లను ఆమోదించి విచారించటం అంటే అలాంటి చట్టాన్ని తీసుకురావాలని పార్లమెంటును ఆదేశించటమేనని, తామాపని చేయకూడదని ప్రధాన న్యాయమూర్తి డి.వై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. దీని గురించి తాజాగా ఆలోచించాలని, ఏ చర్యలు తీసుకున్నది కోర్టుకు తెలపాలని ప్రభుత్వాన్ని కోరింది. 2022 అక్టోబరులో సుప్రీంకోర్టులో దాఖలైన పిటీషన్లపై ప్రభుత్వం స్పందిస్తూ మత ప్రాతిపదికన ఉన్న వ్యక్తిగత చట్టాలు దేశ ఐక్యతకు భంగం కలిగిస్తున్నట్లు, ఏకరూప పౌరస్మృతిని తీసుకువస్తామని పేర్కొన్నది.



ఎం. కోటేశ్వరరావు

దేశ ఐక్యతకు, సామాజిక సమతుల్యతకు ముప్పు తెస్తున్న అంశాలలో విద్వేష పూరిత ప్రసంగాలు, ఇతర వివాదాస్పద అంశాలు, చట్టాన్ని కొందరు చేతుల్లోకి తీసుకోవటం, వ్యవస్థల దుర్వినియోగం వంటివి నేడు ప్రధానంగా ముందుకు వచ్చాయి. అలాంటి వారి మీద ఫిర్యాదు లేకున్నా కేసులు నమోదు చేయాలని సుప్రీం కోర్టు ఒకటికి రెండుసార్లు చెప్పాల్సి వచ్చింది. దీన్ని మరో విధంగా చెప్పాలంటే అలాంటి ప్రసంగాలు చేసిన వారి మీద కేసు నమోదు చేసిన వారికి భద్రత లేదన్నది స్పష్టం. ఆదేశిక సూత్రాల్లోని పని, విద్య, నిరుద్యోగ భృతి వంటి హక్కులను అమల్లోకి తెస్తే కరోనా కాలంలో వలస కార్మికులు దిక్కులేని చావులకు, ఇబ్బందులకు గురయ్యేవారు కాదు. వలస కూలీలు తమ ఉపాధిని దెబ్బతీస్తున్నారని స్థానికులు దాడులకు దిగేవారూ కాదు. రిజర్వేషన్ల కోసం తన్నుకునేదాకా వచ్చేవారూ కాదు. తాజాగా మణిపూర్ మంటలూ ఉండేవి కాదు, ప్రధాని మోడీ కనిపించటం లేదనే పోస్టర్లూ వెలువడేవి కాదు.

ఏకరూప పౌరస్మృతి అంటే ఎలా ఉంటుందో కేంద్ర ప్రభుత్వం ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించి ఎలాంటి మార్పులు చేసేదీ జనంలో చర్చకు పెడితే దాని గురించి ఉన్న అనేక అపోహలు తొలుగుతాయి. ఏమైనా సరే వెంటనే అమలు జరపాలని కోరుతున్న మోడీ సర్కార్ గత తొమ్మిది సంవత్సరాలుగా అలాంటిదేమీ తీసుకురాలేదు. రూపురేఖలు లేని ఒక ప్రతిపాదన మీద అభిప్రాయాలు చెప్పమంటే ఏం చెబుతారు? గతంలో చెప్పిన అభిప్రాయాలకు కాలదోషం పట్టిందని వర్తమాన లా కమిషన్ ఏ ప్రాతిపదికన నిర్ధారించింది. అసలది ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ తప్ప రాజ్యాంగబద్ధమైనది కాదు, ప్రభుత్వం దాని ద్వారా అభిప్రాయ సేకరణ జరపమని కోరింది గాని రాజ్యాంగ ఆదేశం



ప్రస్తుతం వివిధ మతాల వ్యక్తిగత చట్టాల ప్రకారం ఒకే అంశంపై ఏకీ భావం లేదు. ఎవరి భాష్యాలు వారు చెబుతున్నారు. జనంలో అనేక అనుమానాలు, గందరగోళం ఉంది. ఏక రూప పౌర స్మృతిని బిజెపి బలవంతంగా రుద్దాలనుకుంటే ప్రస్తుతం దానికి అడ్డులేదు. పార్లమెంటులో దానికి గుడ్డిగా మద్దతు ఇచ్చే పార్టీలు ఉన్నందున అదేమీ పెద్ద అంశం కాదు. దాన్ని ఒక ఎన్నికల ప్రచార అస్త్రంగా, ముస్లింల మీద విద్వేషాలు, వ్యతిరేకతను రెచ్చగొట్టి మెజారిటీ ఓటు బాంకు సృష్టికి, సంతుష్టీకరణకు పూనుకుంది.

లేదు. ఏకరూప పౌరస్మృతిని ముస్లింలు లేదా ఏమతం వారైనా ఎలాంటి హేతుబద్ధత లేకుండా గుడ్డిగా తిరస్కరించనవసరం లేదు, భిన్నాభిప్రాయం వెల్లడించవచ్చు, ముసాయిదాను ముందు పెడితే వివరణలు కోరవచ్చు.

ఆదేశిక సూత్రాల్లో అనేక అంశాలు ఉన్నప్పటికీ మిగతావాటిని అమలు జరపకుండా ఏకరూప పౌరస్మృతి మీద బిజెపి కేంద్రీకరణ అన్నది ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నారని ఆ మతానికి చెందినవారితో పాటు ఇతర మతాల వారు, మతం, కుల పట్టింపులు లేనివారు కూడా బలంగా నమ్ముతున్నారు. దాన్ని ఏకాభిప్రాయంతో సాధించాల్సి ఉందని అంబేద్కర్‌తో సహా మెజారిటీ భావించిన కారణంగానే ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు పది సంవత్సరాలు చాలని నాడు భావించారు. ఆ లక్ష్యం నెరవేర లేదు గనుక పొడిగిస్తూ వస్తున్నారు. తరువాత ఓబిసిలకూ వర్తింప చేశారు. పౌరస్మృతి మీద ఇప్పటికీ ఏకాభిప్రాయ పరిస్థితి ఉందా అంటే లేదు. అసలు హిందువులందరూ దానితో ఏకీభవిస్తారా అన్నది ప్రశ్న. కర్ణాటకలో ఎక్కువగా ఉన్న లింగాయతులు తమను ప్రత్యేక మతానికి చెందిన వారిగా పరిగణించాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. శైవులు, వైష్ణవులు వారిలో కులాల వారీ భిన్న ఆచారాలు, ఇలా ఎన్నో విభిన్నతలు ఉన్నాయి. వాటన్నింటిలో బిజెపి లేదా కేంద్ర ప్రభుత్వం వేలు బెట్టాలని, ఫలానా పద్ధతి పాటించాలని ఆదేశించాలని చూస్తున్నదా? అందుకే ముసాయిదా చట్టాన్ని ముందు పెడితే ఇలాంటి అనుమానాలకు తెరపడుతుంది లేదా కొత్త అంశాలు ముందుకు రావచ్చు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తే అదేదో ముస్లింలకు సంబంధించిందని అనేక మంది భావించి మద్దతు ఇచ్చారు. రాముడి గుడి కడతామంటే సరే అన్నారు. వ్యక్తిగత అంశాల్లో తమదాకా వస్తే అలాగే ఉంటారా? ఒక కులానికి చెందిన వారు మరో కులం, మతానికి చెందిన వారిని వివాహం చేసుకోకూడదని తీర్మానాలు చేస్తున్న పంచాయత్‌లు సాగుతూనే ఉన్నాయి.ఎవరికి వారు తమ కులాన్ని, మతాన్ని పవిత్రంగా మార్చాలని చూస్తున్నారు. అలాంటి స్థితిలో అందరూ సమానమే, ఒకటే అనే భావనను అంగీకరిస్తాయా?

గోవాలో ఏకరూప పౌరస్మృతి అమలు జరుపుతున్నపుడు ఇతర చోట్ల ఎందుకు అమలు జరపకూడదు అని కొందరు వాదిస్తున్నారు. పోర్చుగీసు పాలనలో ఉన్న గోవా 1961లో దేశంలో విలీనమైంది. అప్పటి వరకు అక్కడ అమల్లో ఉన్న పౌరస్మృతిని మార్చి కొత్త విధానాన్ని వర్తింప చేయాల్సిన అగత్యం తలెత్తలేదు. దాన్నే వర్తింప చేసేందుకు నాడు కేంద్రం అంగీకరించింది, ఎవరూ అభ్యంతర పెట్టలేదు. అలాంటి చట్టాన్ని మిగతా దేశంలో అమలు జరపవద్దని ఎవరూ అనటం లేదు, బలవంతంగా రుద్దటం గాక అనుమానాలను తీర్చి అమలు జరపాలని చెబుతున్నారు. అందుకు అనువైన వాతావరణం లేదు గనుక తొందరపడవద్దంటున్నారు. మిగిలిన ఆదేశిక సూత్రాలు అమలు జరిపిన తరువాత దీన్ని కూడా చేపట్టవచ్చు. గోవాలో ఉన్న చట్టం ప్రకారం వివాహమైన వెంటనే ఏ మతం వారికైనా భర్త ఆస్తిలో భార్యకు సగం వాటా మీద హక్కు దఖలు పడుతుంది. దేశంలో దాన్ని అమలు చేస్తే ఇప్పుడున్న హిందూ అవిభక్త కుటుంబం, దానితో పాటే ఆ పేరుతో పొందుతున్న పన్ను రాయితీ రద్దవుతుంది. దీన్ని దేశంలోని హిందువులందరూ సమ్మతిస్తారా? ఉత్తరాదిన సప్తపది హోమం చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణ చేస్తేనే వివాహం జరిగినట్లు, దక్షిణాదిన అదే హిందువుల్లో ఎవరైనా పాటించవచ్చు తప్ప విధి కాదు. లేదు. ఇలాంటి అనేక తేడాలు ఉన్నప్పుడు ఏక రూప చట్టం ఎలా ఉంటుందో ఎవరిని ఎలా ప్రభావితం చేస్తుందో, ఎలా స్పందిస్తారో తెలియదు. పంజాబ్‌లో వారసత్వ హక్కులు హిందువులకు ఒక విధంగా సిక్కులకు మరొక విధంగా ఉన్నాయి. ముస్లిం పర్సనల్ లా ప్రకారం ఆ మతానికి చెందిన పురుషులు నలుగురిని వివాహం చేసుకోవచ్చు, ఆ మేరకు వివాహాలు చేసుకుంటూ హిందువులు మెజారిటీగా ఉన్న దేశాన్ని ముస్లిం మెజారిటీగా మార్చేందుకు కుట్ర పన్నుతున్నారంటూ కాషాయ దళాలు నిరంతరం చేస్తున్న గోబెల్స్ ప్రచారం తెలిసిందే.

దేశంలో జరిపిన నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం ఓబిసిలు 40.94, దళితులు 19.59, గిరిజనులు 8.63 శాతం ఉన్నారు. వీరిలో అనేక కులాలు, ఉపకులాలు ఆచారాలు, సాంప్రదాయాలన్నీ ఒకటే కాదు, వీరందరూ హిందువులే, ఎంతో భిన్నత్వం కలిగిన వారందరికీ ఒకే పౌరస్మృతిని అమలు జరిపే ముందు వీరిలో ఉన్న అనుమానాలను తొలగించాలా లేదా? దానికి మార్గం నమూనా చట్టం జనం ముందు పెట్టటమే.

ప్రస్తుతం వివిధ మతాల వ్యక్తిగత చట్టాల ప్రకారం ఒకే అంశంపై ఏకీభావం లేదు. ఎవరి భాష్యాలు వారు చెబుతున్నారు. జనంలో అనేక అనుమానాలు, గందరగోళం ఉంది. ఏక రూప పౌరస్మృతిని బిజెపి బలవంతంగా రుద్దాలనుకుంటే ప్రస్తుతం దానికి అడ్డులేదు. పార్లమెంటులో దానికి గుడ్డిగా మద్దతు ఇచ్చే పార్టీలు ఉన్నందున అదేమీ పెద్ద అంశం కాదు. దాన్ని ఒక ఎన్నికల ప్రచార అస్త్రంగా, ముస్లింల మీద విద్వేషాలు, వ్యతిరేకతను రెచ్చగొట్టి మెజారిటీ ఓటు బాంకు సృష్టికి, సంతుష్టీకరణకు పూనుకుంది. దీనికి ఇస్లాం లేదా దేశంలోని ముస్లింలు వ్యతిరేకమనే ప్రచారం చేస్తున్నారు. దీనిలో వాస్తవం–వక్రీకరణ రెండూ ఉన్నాయి. ముస్లిం మతశక్తులు గుడ్డిగా సంస్కరణలను వ్యతిరేకిస్తున్నాయి తప్ప సామాన్య ముస్లింలందరూ అలా లేరు, అదే విధంగా హిందూత్వ పేరుతో వీరంగం వేస్తున్న వారు ముస్లింల పట్ల గుడ్డి ద్వేషాన్ని వెళ్లగక్కుతుంటే మొత్తం హిందువులందరూ అలా లేరు. ఏ మతమైనా వర్తమానానికి అనుగుణంగా మారకపోతే మౌఢ్యం పెరుగుతుంది. ఉన్న మతాల్లో హిందూ అని చెబుతున్న అనేక సామ్యాలున్న శైవ, వైష్ణవ ఇతర వివిధ మతాలు వేల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నందున అనేక సంస్కరణలు చోటు చేసుకున్నాయి. లేకపోతే జనం మతాలను పక్కన పెట్టేస్తారు. అమెరికా వెళ్లి హిందూమత గొప్పతనం గురించి ప్రసంగించిన స్వామి వివేకానందుడి గురించి గొప్పగా చెబుతారు. సముద్రయానం చేశాడనే కారణంగా తిరిగి వచ్చిన తరువాత అదే హిందూమతం వివేకానంద దేవాలయ ప్రవేశాన్ని అడ్డుకుంది. ఇటీవలి కాలంలో ఆ మూఢనమ్మకాన్ని సవరించుకొని పరిహారంగా కొన్ని క్రతువులు చేస్తే చాలని సరిపుచ్చుతున్నారు. ఎందుకంటే అనేక మంది స్వామీజీలు విదేశాల సందర్శన సరదాను అణుచుకోలేకపోయారు. మడిని గట్టున పెట్టి వెళ్లారు. సముద్రం దాటిన వారు కులాన్ని కోల్పోతారని శాస్త్రాల్లో రాసి ఉంది మరి. ఎవరైనా కులం పోగొట్టుకున్నవారు ఉన్నారా? లేకపోగా విదేశాల్లో కూడా కుల గజ్జిని వ్యాపింప చేస్తున్నారు. దేశ పరువును గంగలో కలుపుతున్నారు. ఉన్న మతాలలో తాజాది ఇస్లాం గనుక ఆ మతం మీద ముల్లా "అగ్రహారికుల" ప్రభావం ఎక్కువగా ఉంది. వివాహం, విడాకులు, ఆస్తి హక్కులు, సంరక్షణ, దత్తత వంటి అంశాలు ఎంతో సున్నితమైనవి గనుక వాటిని సమానత్వ ప్రాతిపదికన, లింగవివక్ష లేకుండా ఎలా చట్టాన్ని రూపొందించాలన్నది పెద్ద ఎత్తున చర్చ జరగాలి. అన్ని మతాలూ మహిళను చిన్న చూపు చూసేవే, అణచేందుకు చూసేవే. అందువలన వారికి అనుకూలమైన ఏ చట్టం రూపొందాలన్నా చట్ట సభల్లో వారికి హక్కుగా ప్రవేశించే హక్కు కల్పించటం ముందుగా జరగాలి. అప్పుడే పితృస్వామిక సమాజ పెత్తనాన్ని చట్టబద్ధంగా కూడా అడ్డగోగలరు. అనుమానాలను తొలగిస్తూ, విశ్వాసాన్ని పాదుకొల్పుతూ తేవాల్సిన ఏకరూప పౌర స్మృతిని...బిజెపి కోరుకుంటున్నట్లుగా ఏకపక్షంగా రుద్దకూడదు.

వ్యాఖ్య

మణిపూర్‌ను పట్టించుకోని మోడీ !

మణిపూర్ మంటలు ఈశాన్య భారతంలో బిజెపి విచ్ఛిన్నకర రాజకీయాలకు ప్రతీకగా మారాయి. కేవలం నాలుగు మాసాల క్రితమే, ఫిబ్రవరిలో, ఈశాన్య ప్రాంతంలోని త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ ఎన్నికల్లో బిజెపి సాధించిన విజయాన్ని నరేంద్ర మోడీ ప్రజలతో పంచుకున్నారు. ఈశాన్య ప్రాంతంలోని క్రైస్తవులు కూడా బిజెపిని ఆమోదించారని ఆయన చెప్పుకున్నారు. ఇప్పటికి ఏడు వారాల నుండి అంటే మే 3వ తేదీ నుండి మణిపూర్‌లో హింస ప్రబలుతోంది. సాయుధ ముఠాల ఘర్షణలు, హత్యలు, గృహ దహనాలు రాష్ట్రాన్ని ధ్వంసం చేశాయి. వందలాది ఇళ్ళు, దాదాపు 200 చర్చిలు, 17 ఆలయాలు తగలబడ్డాయి. ఇంఫాల్‌లో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి ఇంటిని కూడా వదిలిపెట్టలేదు. సైన్యంతో పాటుగా 35 వేల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను రాష్ట్రంలో మోహరించినప్పటికీ సాయుధ కుకీలు, మెయితే గ్రూపుల దాడులు కొనసాగుతూనే వున్నాయి. మృతుల సంఖ్య వంద దాటింది. సహాయ శిబిరాల్లో 50 వేల మందికి పైగా నిర్వాసితులు తల దాచుకున్నారు.

పూర్తిగా హింస గుప్పిట్లో రాష్ట్రం విలవిలలాడుతూ 26 రోజులు గడిచిన తర్వాత మే 29న కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించారు. ఆయన పర్యటన గానీ, ఆయన ప్రకటించిన చర్యలు గానీ హింసను అదుపు చేయలేకపోయాయి. ఇరు పక్షాలకు చెందిన తీవ్రవాద శక్తులు రాష్ట్రంలో కొరవడిన శాంతి భద్రతల పరిస్థితులను అవకాశంగా తీసుకుని వ్యవహరిస్తుండడంతో మెయితే, కుకీల మధ్య తలెత్తిన విభేదాలు మరింత ప్రస్ఫుటమయ్యాయి. మణిపూర్ చాలా సున్నితమైన సరిహద్దు రాష్ట్రం. ఇక్కడ 36 జాతులు, మత కమ్యూనిటీలు జీవిస్తుండడంతో వైవిధ్యతకు పేరెన్నిక గన్న రాష్ట్రంగా వుంది. ఈ కమ్యూనిటీల్లో ప్రధానమైనవి–మెయితే కమ్యూనిటీ, ఇంఫాల్ లోయలో ప్రధానంగా వీరు వుంటారు. హిందూమతాన్ని లేదా దేశీయ సనమహి మతాన్ని వీరు పాటిస్తారు. ఇక కుకీలు, నాగాలు మిగిలిన రెండు కమ్యూనిటీలు.

PEOPLE'S DEMOCRACY

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆసక్తి కలిగించే అంశమేమంటే ... ప్రధాని నరేంద్ర మోడీ మౌనం పాటించడం. మణిపూర్‌లో పరిస్థితి గురించి ఆయన ఇప్పటివరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పైగా రాష్ట్రంలో శాంతి నెలకొనాలని, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ జరగాలని ప్రజలకు ఒక్కసారి కూడా విజ్ఞప్తి చేయలేదు. మూడు రాజకీయ ప్రతినిధి బృందాలు ఢిల్లీలో ప్రధానితో భేటీ కోసం పడిగాపులు పడుతున్నాయి. వీటిలో రెండు ప్రతినిధి బృందాల్లో బిజెపి ఎంఎల్‌ఎలు వుండగా, మూడో బృందంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారున్నారు.


వీరు ప్రధానంగా క్రైస్తవులు. వీరు కాకుండా, ఇంకా అనేక చిన్న చిన్న గిరిజన కమ్యూనిటీలు, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు వుంటారు.

దశాబ్దాల తరబడి, వివిధ జాతులకు చెందిన సాయుధ గ్రూపుల తీవ్రవాద కార్యకలాపాలతో మణిపూర్ ఇబ్బందులు పడుతోంది. గతంలో, నాగాలు, కుకీల మధ్య ఘర్షణలు జరిగేవి. 2017లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడంతో ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు మెయితేలను హిందూ శక్తిగా సంఘటితపరిచి క్రైస్తవులైన కుకీలపై ఎక్కుపెట్టడంలో చురుకుగా వ్యవహరించాయి. ఇది మెయితే–కుకీ సంఘర్షణకు దారితీసింది. అంతిమంగా హిందూ–క్రైస్తవ ఘర్షణగా కూడా రూపుదిద్దుకుంది.

మయన్మార్ నుండి చిన్ శరణార్థులు వేలాదిగా వలస రావడంతో ఇటీవల కాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. 2021లో అధికారం చేజిక్కించుకున్న మిలటరీ అణచివేతకు పాల్పడడంతో దాన్నుండి తప్పించుకోవడానికి చిన్ శరణార్థులు మణిపూర్ వలస వచ్చేశారు. చిన్ కమ్యూనిటీ అంటే కుకీ జాతికి చెందినవారే. మిజోరాం, మణిపూర్ రెండు రాష్ట్రాల్లోనూ, ఈ శరణార్థులను వారి జాతికి చెందిన బంధువులే స్వాగతించారు. ఆశ్రయం ఇచ్చారు. అయితే భారత ప్రభుత్వం వారికి శరణార్థుల హోదా ఇవ్వడానికి తిరస్కరిస్తోంది. వారిని అక్రమ, చట్టవిరుద్ధమైన మైగ్రెంట్లుగా ప్రకటించింది.

రిజర్వ్ ఫారెస్టుల నుండి ఖాళీ చేసే చర్యలు చేపట్టడం ద్వారా బీరేన్ సింగ్ ప్రభుత్వం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. దీనివల్ల పెద్ద సంఖ్యలో కుకీ కుటుంబాలు ప్రభావితమయ్యాయి. గంజాయి సాగుపై అణచివేత చర్యలు కూడా కుకీలపై తీసుకున్న ఘర్షణాయుత చర్యగా చూడాల్సి వుంది. అరంబాయి తెంగోల్, మెయితే లీపన్ వంటి మెయితే తీవ్రవాద గ్రూపులను ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలు ప్రోత్సహిస్తున్నాయి. పైగా ఈ మెయితే గ్రూపులు కుకీలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి. వారిని చట్టవిరుద్ధంగా జొరబడిన బయటి వ్యక్తులుగా ముద్ర వేస్తున్నారు.

ఎన్నికల సమయంలో తమకు సాయం చేసేందుకు కొన్ని కుకీ సాయుధ తీవ్రవాద గ్రూపులను ఎంపిక చేసుకున్నట్లు బయటపడడంతో బిజెపి బూటకపు ఎత్తుగడ వెలుగులోకి వచ్చింది. 2019 జూన్‌లో సాయుధ కుకీ గ్రూపు నేత, యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్ (యుకెఎల్‌ఎఫ్) చైర్మన్‌గా వున్న ఎస్.ఎస్.హాకిప్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి రాసిన లేఖ ద్వారా ఈ విషయం బయటపడింది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు కోసం బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఈశాన్య రాష్ట్రాల ఇన్‌చార్జి రామ్ మాధవ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు తన వద్దకు వచ్చారని ఆ లేఖలో కుకీ నేత పేర్కొన్నారు. ఇందుకు గానూ డబ్బు కూడా చెల్లించారని ఇంఫాల్ లోని ఎన్‌ఐఎ కోర్టులో సమర్పించిన అఫిడవిట్‌కు అనుబంధంగా ఆ లేఖను కూడా అందచేయడంతో ఈ విషయం స్పష్టమైంది. 2008లో 'సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్' ఒప్పందంలో చేరిన సంస్థల్లో యుకెఎల్‌ఎఫ్ కూడా ఒకటి.



బిజెపి ఆడిన ఈ మోసపూరితమైన క్రీడ, మెయితేల్లో బీరేన్‌సింగ్ ప్రభుత్వ నిజ స్వరూపాన్ని బయటపెట్టింది. కుకీలకు సంబంధించినంత వరకు, వారు పూర్తిగా బీరేన్‌సింగ్‌కు వ్యతిరేకంగా వున్నారు. అసలు తమ సమస్యలన్నింటికీ మూల కారణం ఆయనేనని వారు అభిప్రాయపడుతున్నారు. కుకీ కొండ ప్రాంత జిల్లాల్లోని పదిమంది ఎంఎల్‌ఎలు ఇప్పుడు కుకీ ఏరియాకు ప్రత్యేక ప్రభుత్వం కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎంఎల్‌ఎల్లో చాలామంది బిజెపికి చెందినవారే.

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆసక్తి కలిగించే అంశమేమంటే ప్రధాని నరేంద్ర మోడీ మౌనం పాటించడం. మణిపూర్‌లో పరిస్థితి గురించి ఆయన ఇప్పటివరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పైగా రాష్ట్రంలో శాంతి నెలకొనాలని, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ జరగాలని ప్రజలకు ఒక్కసారి కూడా విజ్ఞప్తి చేయలేదు. మూడు రాజకీయ ప్రతినిధి బృందాలు ఢిల్లీలో ప్రధానితో భేటీ కోసం పడిగాపులు పడుతున్నాయి. వీటిలో రెండు ప్రతినిధి బృందాల్లో బిజెపి ఎంఎల్‌ఎలు వుండగా, మూడో బృందంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారున్నారు. అమెరికాకు బయలుదేరి వెళ్ళేటపుడు మాత్రమే వారు ప్రధానిని చూశారు. ప్రధాని తరపున ఇలా పూర్తిగా జవాబుదారీతనం కొరవడడం మణిపూర్ లోని అన్ని వర్గాల ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చిందరవందరగా వుండడం, పైగా స్పష్టమైన రీతిలో అధికార వైఖరి లేకపోవడంతో...బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని తొలగించడం రాజకీయంగా తీసుకోవాల్సిన తక్షణ తొలి చర్యగా వుంది. అటువంటి చర్య తీసుకోనట్లయితే, ఈశాన్య ప్రాంతంలో పాలక పార్టీ సాగించిన సంకుచిత, వేర్పాటువాద రాజకీయాలు సృష్టించిన సంక్షోభం నుండి బయటపడే మార్గమే లేదు.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కవిత్వం

కూలిపోవాల్సిందే..!

ప్రశ్నించే గొంతుక
నరాన్ని తెంచుతారెందుకు?
ఎదిరించే పిడికిలి
ఎముకను విరుస్తారెందుకు?
నిలదీసే గుండె
ధైర్యాన్ని తొక్కుతారెందుకు?
నిప్పులు కక్కే కళ్ళు
పొడుస్తారెందుకు?
ఓటు వేసిన వేలును
నిర్దాక్షిణ్యంగా నరుకుతారెందుకు?
చలి చీమల కథ వినలేదా?
గడ్డి పరకల బలం చూడలేదా?
గత చరిత్ర పుటలు
ఇంకా చెదలు పట్టనే లేదు
ప్రతి పుటను పరిశీలిస్తే
ప్రజాస్వామ్యపు పునాదులు
చెక్కుచెదరనే లేదు
పునాదులు కదిలితే
ఎవరి పీఠాలైనా కూలిపోవాల్సిందే!

- కయ్యూరు బాలసుబ్రమణ్యం

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

రాత్రిపూట బాదుడే!

- కేంద్రం కొత్త విద్యుత్ నిబంధనలు

న్యూఢిల్లీ: రాత్రిపూట విద్యుత్ వినియోగంపై భారం మోపాలని కేంద్రం నిర్ణయించింది. త్వరలో కొత్త విద్యుత్ ఛార్జీలు అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం పగటిపూట విద్యుత్ ఛార్జీలు 20 శాతం వరకు తగ్గనున్నాయి. డిమాండ్ ఎక్కువగా ఉండే రాత్రి వేళల్లో విద్యుత్ ఛార్జీలు సాధారణం కంటే 10 నుంచి 20 శాతం మేర పెంచనున్నారు. దీనికి సంబంధించిన కొత్త విద్యుత్ నియమాలను కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ శుక్రవారం ప్రకటించింది. 2024 ఏప్రిల్ నుంచి వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ఈ విధానం తొలుత అమలులోకి వస్తుందని తెలిపింది. వ్యవసాయ రంగం మినహా, మిగతా అన్ని రంగాల విద్యుత్ వినియోగదారులకు 2025 ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధన వర్తింపజేయనున్నట్లు వెల్లడించింది. యూజర్లు ఏ సమయంలో ఎంత విద్యుత్ ఉపయోగించారనేది స్మార్ట్ మీటర్ల ఆధారంగా గుర్తిస్తామని పేర్కొంది.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- నలుగురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారాలో శుక్రవారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మిలిటెంట్లు మరణించారు. కుప్వారాలోని మచల్ సెక్టార్‌లో గల నియంత్రణరేఖ (ఎల్ఒసి) సమీపంలో పోలీసులు, ఆర్మీ అధికారులు శుక్రవారం సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో నియంత్రణ రేఖ మీదుగా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి భారత్‌లోకి చొరబడేందుకు యత్నిస్తున్న నలుగురు ఉగ్రవాదులను భద్రతా సిబ్బంది గుర్తించారు. కాల్పుల్లో ఆ నలుగురు మరణించినట్లు కాశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. గతవారం కూడా కుప్వారాలోని నియంత్రణ రేఖ(ఎల్ఒసి)కి సమీపంలో ఉన్న జంగుండ్ కెరాన్ వద్ద భారీ చొరబాటు ప్రయత్నాల్ని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. నాటి ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఐదుగురు మిలిటెంట్లు మరణించినట్లు కాశ్మీర్ పోలీసులు పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో కెపిసిసి అధ్యక్షుడు అరెస్టు

తిరువనంతపురం : కెపిసిసి అధ్యక్షుడు, కన్నూరు ఎంపి కె.సుధాకరణ్‌ను చీటింగ్ కేసులో కేరళ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏడున్నర గంటల సుదీర్ఘ విచారణ అనంతరం వివాదాస్పద పురాతన వస్తువుల డీలర్ మాన్సన్ మావుంకల్‌తో సంబంధాలున్నాయని నిర్ధారించిన క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు ఆయను అరెస్టు చేశారు. మాన్సన్‌కు ఇప్పటికే పోస్కో చట్టంలోని నిబంధనల ప్రకారం రెండు జీవిత ఖైదుల శిక్ష పడింది. కొచ్చిలోని మాన్సన్ నివాసా నికి 2018, 19లో సుధాకరణ్ వెళ్లినట్లు, నిరంతరం అతనితో ఫోన్‌లో సంభాషించినట్లు క్రైమ్‌బ్రాంచికి ఆధారాలు లభించాయి. ఫొటోలు, లాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను మాన్సన్ నుంచి స్వాధీనం చేసుకుని, పోలీసులు సీజ్ చేశారు. మాన్సన్ ద్వారా మోసపోయిన ఇద్దరు వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుధాకరణ్‌పై కేసు నమోదు చేశారు. సుధాకరణ్ సమక్షంలో మాన్సన్‌కు రూ.25 లక్షలు ఇచ్చి, మోసపోయినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వివక్షకు తావే లేదు !

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితులపై, ప్రజాస్వామ్యంపై ఆయన ఇచ్చే సమాధానాలతోనే ఇది తెలుస్తుందని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

నియంతృత్వం వైపునకు భారత్ మళ్ళుతున్నా బైడెన్ ఎందుకు మౌనంగా వున్నారు? అంటూ లాస్ ఏంజెల్స్ టైమ్స్ ప్రశ్నించింది. "భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో వుంది. అయితే ఇదేమీ జరగడం లేదంటూ అధ్యక్షుడు బైడెన్, ఇతర ప్రజాస్వామ్య నేతలు నటించడానికి భారత్‌లో నైతిక, రాజకీయ, ఆర్థికపరమైన పరిస్థితులు అనువుగా లేవు." అని పేర్కొంది. ఇందుకు ఉదాహరణగా రాహుల్ పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోవడాన్ని ఉదహరించింది.


ఎన్ని లోపాలు, లొసుగులు బయటపడినా అమెరికన్ నేతలు భారత్‌ను, మోడీని పొగుడుతునే వుంటారని ది అట్లాంటిక్ మేగజైన్ వ్యాఖ్యానించింది. 2002 గుజరాత్ అల్లర్లు, ముఖ్యమంత్రిగా మోడీ అక్కడి పరిస్థితుల పట్ల వ్యవహరించిన తీరును గుర్తించడంలో అట్లాంటిక్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.. చైనాను ఒంటరిపాటు చేయాలన్న అమెరికా వ్యూహంలో భారత్‌ను కీలక భాగస్వామిగా చేసుకునేందుకు బైడెన్ ప్రభుత్వం తెచ్చిన ఒత్తిడి, మోడీ అందుకు తలొగ్గిన తీరు వంటి ముఖ్యమైన అంశాలపై అమెరికన్ మీడియా ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది.

అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ దంపతులతో, విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో శుక్రవారం ప్రధాని మోడీ విందు సమావేశంలో పాల్గొన్నారు. ఇరు దేశాల సంబంధాల్లో కొత్త శకం ఆవిష్కృతమవుతోందని మోడీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ పర్యటనతో ఇరు దేశాల భాగస్వామ్యం మరో స్థాయికి చేరిందని అన్నారు. ఈ శతాబ్దాన్ని తీవ్రంగా ప్రభావితం చేయగల భాగస్వామ్యం ఇదని వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య నెలకొన్న స్నేహ సంబంధాలతో ప్రపంచాన్ని మరింత మెరుగైన స్థితిలో వుంచగలమన్నారు.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచుకునేందుకు గానూ ఇకపై డబ్ల్యుటిఓ వివాదాలకు స్వస్తి చెప్పాలని భారత్, అమెరికా నిర్ణయించాయని నిపుణులు భావిస్తున్నారు. డబ్ల్యుటిఓలో ప్రస్తుతమున్న ఆరు వివాదాల్లో మూడు అంశాలపై భారత్ ఫిర్యాదు చేయగా, మరో మూడింటిపై అమెరికా ఫిర్యాదు చేసింది.

'టైటాన్' అన్వేషణ విషాదాంతం..

- ఐదుగురు మృతి : అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటన



బోస్టన్ : అట్లాంటిక్ మహాసముద్రంలో తప్పిపోయిన పర్యాటకుల మినీ జలాంతర్గామి 'టైటాన్' అన్వేషణ విషాదాంతమైంది. సముద్ర గర్భంలో టైటానిక్ సమీపంలో టైటాన్ శకలాలను గుర్తించినట్లు అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటించింది. టైటాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు చనిపోయారని, వారి కుటుంబ సభ్యులకు తెలిపినట్లు పేర్కొంది. సముద్రంలో సుమారు 4 కిలోమీటర్ల లోతులో ఉన్న టైటానిక్ నౌక శకలాలను చూసేందుకు ఆదివారం బయలుదేరిన టైటాన్ కొన్ని గంటల్లోనే తప్పిపోయిన విషయం తెలిసిందే.

భారత కాలమాన ప్రకారం... గురువారం సాయంత్రం 7 గంటల 15 నిమిషాల వరకే ఆక్సిజన్ సరిపోతుందని అంచనా వేశారు. పాకిస్థాన్ బిలియనీర్ షెహజాదా దావూద్ (48), ఆయన కుమారుడు సులేమాన్ (19), బ్రిటీష్ వ్యాపారవేత్త హమీష్ హార్డింగ్, ఈ యాత్ర నిర్వాహకుడు స్టాక్టన్ రష్, ఫ్రెంచ్ మాజీ నావికా అధికారి పాల్ హెన్రీ ఈ జలాంతర్గామిలో ఉన్నారు. మూడు రోజుల నుంచి వీరి ఆచూకీ తెలియలేదు. కెనడా, అమెరికా తీర రక్షక దళాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. వీరు ప్రయాణిస్తున్న టైటాన్‌లో 96 గంటలకు సరిపడా ఆక్సిజన్ నిల్వలే ఉండటంతో క్షణక్షణం ఉత్కంఠగా మారింది. గురువారం సాయంత్రం రిమోట్ ఆపరేటెడ్ వెహికల్ సహాయంతో టైటానిక్ నౌకకు సమీపంలో కొన్ని శకలాలను గుర్తించినట్లు అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటన విడుదల చేసింది.

తీవ్రమైన పీడనం పెరగడం వల్లే పేలుడు...

తీవ్రమైన పీడనం పెరగడం వల్ల 'టైటాన్' పేలిపోవడంతో అందులో ఉన్న ఐదుగురు మరణించారని అమెరికా కోస్ట్‌గార్డ్ ప్రకటించింది. రిమోట్ కంట్రోల్డ్ వెహికల్ సాయంతో మినీ జలాంతర్గామి శకలాలను గుర్తించామని తెలిపింది. టైటానిక్ ఓడ సమీపంలో 488 మీటర్ల దూరంలో ఈ శకలాలను గుర్తించినట్లు యుఎస్ కోస్ట్ గార్డ్ పేర్కొంది. వెంటనే ఈ విషయాన్ని బాధిత కుటుంబాలకు తెలిపినట్లు రియర్ అడ్మిరల్ జాన్ మౌగర్ తెలిపారు. యుఎస్ కోస్ట్ గార్డ్, రెస్క్యూ సిబ్బంది తరఫున మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఈ ఐదుగురు నిజమైన అన్వేషకులు : ఓషన్ గేట్ సంస్థ

"ఈ ఐదుగురు నిజమైన అన్వేషకులు. ప్రపంచ మహాసముద్రాల అన్వేషణ, రక్షణలో వీరు ఎంతో అభిరుచిని కలిగివున్నారు. ప్రస్తుత ఈ విషాద సమయంలో వీరి కుటుంబాల గురించే మా ఆలోచనలు ఉన్నాయి. ఈ ఘటనకు చింతిస్తున్నాం" అని ఓషన్ గేట్ సంస్థ యుఎస్ కోస్ట్‌గార్డ్ వివరణకు ముందు ఒక ప్రకటన విడుదల చేసింది.

'కిడ్నాప్' కేసులో అనుమానాలెన్నో!

- సిట్టింగ్ జడ్జితో విచారణకు సిపిఎం డిమాండ్
- విశాఖ ఎంపి చుట్టూ ముసురుకున్న వివాదం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ రుషికొండ ప్రాంతంలో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎంవివి సత్యనారాయణ కుటుంబాన్ని, ప్రముఖ ఆడిటర్ జీవిని రౌడీషీటర్ హేమంత్‌కుమార్ కిడ్నాప్ చేసి రూ.కోట్లు డిమాండ్ చేసిన వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారుతోంది. ఈ కిడ్నాప్ ఉదంతంలో అనేక అనుమానాలూ ఉన్నాయి. జరిగిన ఘటనపై తక్షణం ప్రభుత్వం, పోలీసు అధికారులు స్పందించి హుటాహుటిన కిడ్నాపర్లను పట్టుకుని ఎంపి కుటుంబాన్ని రక్షించడం వరకూ బాగానే జరిగినా, అనంతరం పలు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఎంపి కుటుంబం కిడ్నాప్ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం విశాఖలో తాజాగా డిమాండ్ చేశారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో తెర వెనుక నుంచి కీలకపాత్ర పోషించిన సుబ్బలక్ష్మి అనే మహిళ ఎవరు ? కిడ్నాపర్లకు ఆమె ఎందుకు సహకరించారు ? అన్నది బయటపెట్టాల్సి ఉంది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ విశాఖలో ఎంపీ చేసిన అభివృద్ధి ఏమీ లేదని, రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో ఆయన దూసుకుపోతున్నారని అన్నారు. అయితే ఈ వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ నేతలెవ్వరూ పల్లెత్తు మాట మాట్లాడకపోవడం విశేషం. టిడిపికి చెందిన ఒక ముఖ్యనేత, బిజెపికి చెందిన విశాఖ నగర నాయకుడు ఎంపి ఎంవివి ఇంటికెళ్లి పరామర్శించారని తెలుస్తోంది. కిడ్నాప్‌కు పాల్పడిన హేమంత్ కుమార్ మరో ఇద్దరు కలిసి రూ.కోట్లన్నర వరకూ డిమాండ్ చేసి ఎంపి కుటుంబం నుంచి ఆ మొత్తాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. కానీ పోలీసులు మాత్రం రూ.86 లక్షలు అంటూ నిర్ధారించారు. అయితే నిందితుల్లో రాజేష్ అనే వ్యక్తి పోలీసులకు ఇంతవరకూ చిక్కలేదు. మిగతా డబ్బంతా ఆయన వద్ద ఉండవచ్చని మరో వాదనా వినిపిస్తోంది.

ఎంపి సత్యనారాయణ విశాఖలో రాజకీయాలు, హైదరాబాద్‌లో వ్యాపారాలు చేసుకుంటానని ప్రకటన చేశారు. అలాగే విశాఖలో బిల్డింగ్ అనుమతులకు అనేక ఇబ్బందులు పెడుతున్నారని ప్రకటించారు. ఇవన్నీ చూస్తే ఆయనకు వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించడం తప్ప మరొక వ్యాపకం లేదని తెలుస్తోంది. ఈ ఘటన తరువాత ప్రజలు శాంతిభద్రతల పట్ల ఆందోళనలు చెందుతున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎంపి అనేక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కిడ్నాప్ ఘటనలో కూడా జివి ద్వారా రూ.1.70 కోట్లు కొన్ని గంటల్లో ఎలా సేకరణ జరిగింది ? ఆ డబ్బులు ఎవరు ఇచ్చారో ? ప్రజలకు తెలియజేయాలి. ఎంపి తన వ్యాపార లావాదేవీలపై శ్వేత పత్రం విడుదల చేయాలి. పోలీసులు ఈ ఘటనను తక్కువ చేసి చూపడం సరికాదు. ప్రభుత్వం ఎంపి కుటుంబానికే రక్షణ కల్పించలేనప్పుడు, విశాఖ ప్రజలకు ఎలా రక్షణ కల్పిస్తుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ కిడ్నాప్‌ను నాటకీయ పరిణామంగా చూడకూడదు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా సరైన విచారణ జరిపించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదు.

ఉద్యోగాలు, ఇళ్లను పణంగా పెడతారా?

- బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు పెంపుపై యూనియన్ల ఆగ్రహం

లండన్ : బ్రిటన్ ప్రభుత్వం, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ప్రమాదకరమైన ఆలోచనా విధానంతో ప్రజలు వారి ఉద్యోగాలను, ఇళ్లను పణంగా పెట్టాల్సి వుంటుందని యూనియన్లు హెచ్చరించాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ అనూహ్యమైన రీతిలో వడ్డీ రేట్లను పెంచింది. ఈ చర్య కుటుంబాలకు తీవ్ర బాధను కలిగిస్తుందని యూనియన్ నేతలు పేర్కొన్నారు. ఫిబ్రవరి నుండి ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో వడ్డీరేట్లు ఐదు శాతానికి చేరాయి. వేతనాల వృద్ధి, సేవల ద్రవ్యోల్బణం పెరిగిన కారణంగా 0.5శాతం పెంపు అనివార్యమైందని బ్యాంక్ పేర్కొంది. ఈ ఏడాది చివరినాటికి వడ్డీరేట్లు 6శాతానికి చేరవచ్చని ఆర్థిక మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే తమ ఆస్తులను తాకట్టు పెట్టిన దాదాపు 14లక్షల మంది, ఈ అదనపు చెల్లింపుల వల్ల కనీసం తమ ఆదాయంలో ఐదవ వంతు నష్టపోతారని మార్కెట్లు హెచ్చరించాయి. వడ్డీరేట్లు పెంపుతో ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుతుందని, దానివల్ల ప్రస్తుత సంక్షోభం మరింత అధ్వానంగా మారుతుందని, ప్రజలు తమ ఇళ్లను, ఉద్యోగాలను కోల్పోతారని టియుసి ప్రధాన కార్యదర్శి పాల్ నొవాక్ హెచ్చరించారు. ప్రభుత్వం, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ యాజమాన్యం చేసిన ప్రమాదకరమైన ఆలోచనా ధోరణి కారణంగానే ఈ వడ్డీ రేట్లు పెరిగాయన్నారు. అంతర్జాతీయంగా ఇంధన రంగానికి తగిలిన ఎదురు దెబ్బల వల్ల ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతోందని, ఇటువంటి సమయంలో వ్యాపారాలు, ప్రజలకు లబ్ది చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వుందని నొవాక్ అన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి

- ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్‌కు మంత్రి పెద్దిరెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - గుడిపల్లి (చిత్తూరు జిల్లా): జిఒ నంబర్ 110 ద్వారా కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ద్రవిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వేణుగోపాలరెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెంచాలని 2022, జులై 6న రాష్ట్ర ప్రభుత్వం జిఒ 110ను విడుదల చేసింది. ద్రవిడ విశ్వవిద్యాలయ 88వ పాలక మండలి సమావేశం జిఒ అమలుకు నిర్ణయించిన నేపథ్యంలో 2022, ఆగస్టు 25న కమిటీ ఏర్పాటైంది. కమిటీ నివేదికను 2022, సెప్టెంబర్ 30న సమర్పించింది. మంత్రి పెద్దిరెడ్డిని అకడమిక్ కన్సల్‌టెంట్స్ కలిసి రాష్ట్రంలో చాలా విశ్వవిద్యాల యాల్లో ఇప్పటికే ఈ జిఒ అమలు చేశారని, వేతనాలను రూ.35వేల నుంచి రూ.57వేలకు పెంచి ఇస్తున్నారని తెలిపారు. జిఒ 110ను అమలు చేయాలని వర్సిటీ రిజిస్ట్రార్‌ను ఆదేశించడంతో కాంట్రాక్టు అధ్యాపకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రెజ్లింగ్ ఫెడరేషన్ ఓటర్ల జాబితాలో బ్రిజ్ భూషణ్ అల్లుడు

- హామీ నిలబెట్టుకోని కేంద్రం

న్యూఢిల్లీ : ఆందోళన చేస్తున్న ఆటగాళ్లకు కేంద్రం ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతూ బ్రిజ్ భూషణ్ అల్లుడు విశాల్ సింగ్ పేరును రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల ఓటర్ల జాబితాలో చేర్చారు. బ్రిజ్ భూషణ్ బంధువులు లేదా సహాయకులు ఎన్నికల్లో పోటీ చేయరని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ గతంలో సాక్షి మాలిక్, ఇతర రెజ్లర్లకు చెప్పారు. బీహార్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా విశాల్ పాల్గొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి బ్రిజ్ భూషణ్ బీహార్ యూనిట్‌ను రద్దు చేసి ఆయన అల్లుడిని అధ్యక్షుడిగా చేశారని మాజీ అధికారులు అడ్‌హాక్ కమిటీకి ఫిర్యాదు చేశారు. రిటర్నింగ్ అధికారిగా ఉన్న జమ్ముకాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మహేశ్ మిట్టల్‌కుమార్ అప్పీల్‌ను పరిశీలించనున్నారు. అడ్‌హాక్ కమిటీ కూడా జాబితాపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. జులై 6 నుంచి 11 వరకు ఎన్నికలను పొడిగించారు. ఓటరు జాబితాలో పేర్లు చేర్చుకునేందుకు గతంలో ఉన్న గడువును 21 నుంచి ఈ నెల 25కి పెంచారు. పది రాష్ట్రాల సమాఖ్యల పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. బ్రిజ్ భూషణ్‌ను అక్రమంగా తొలగించారని మహారాష్ట్ర, హర్యానా, తెలంగాణ, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ యూనిట్లు ఫిర్యాదు చేశాయి.

ప్రత్యేక కోర్టుకు వేధింపుల కేసు

మహిళా అథ్లెట్లను వేధించిన బిజెపి ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై కేసు ఎంపీలు, ఎమ్మెల్యేల నేరాలకు సంబంధించిన ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయబడింది. ఢిల్లీ పోలీసుల దరఖాస్తును పరిగణనలోకి తీసుకున్న చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మహిమా రాయ్ ఈ ఆదేశాలు ఇచ్చారు. అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ ఇప్పుడు కేసును విచారించనున్నారు. 27న కేసు విచారణకు రానుంది. ఆరుగురు రెజ్లర్లను బ్రిజ్‌భూషణ్ చిత్రహింసలకు గురిచేసినట్లు జస్పాల్‌కు ఛార్జిషీటు కూడా అందింది.


పిఎం కిసాన్ మొబైల్ యాప్‌లో ఫేస్ అథెంటికేషన్

- కేంద్ర ప్రభుత్వ పథకంలో తొలిసారి

న్యూఢిల్లీ : మోడీ సర్కారు పిఎం-కిసాన్ యాప్‌లో ఫేస్ అథెంటిఫికేషన్ పద్ధతిని తీసుకొచ్చింది. ఇకపై రైతులు తమ ఇ-కెవైసి ప్రక్రియను వన్ టైమ్ పాస్‌వర్డ్, వేలి ముద్రలకు బదులుగా మొబైల్ ఫోన్‌లలో తమ ఫేస్‌ను స్కానింగ్ చేయటం ద్వారా పూర్తి చేసుకోవచ్చు. కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఈ యాప్ ఫీచర్‌ను ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కైలాశ్ చౌదరి, సంబంధిత అధికారులు కూడా హాజరయ్యారు. ఫేషియల్ అథెంటికేషన్ మొబైల్ యాప్ ద్వారా ఇ-కెవైసి చేసుకునే తొలి ప్రభుత్వ పథకంగా పిఎం-కిసాన్ స్కీం నిలిచిందని కొత్త ఫీచర్ గురించి వివరాలను వెల్లడిస్తూ అగ్రికల్చర్ అదనపు సెక్రెటరీ ప్రమోద్ కుమార్ మహేంద్ర వెల్లడించారు. పిఎం-కిసాన్ మొబైల్ యాప్‌లో ఫేస్ అథెంటిఫికేషన్‌కు సంబంధించి వ్యవసాయ మంత్రిత్వ శాఖ పైలెట్ టెస్టింగ్‌ను ఈ ఏడాది మే 21న ప్రారంభించిందని, అప్పటి నుంచి మూడు లక్షల మంది రైతుల ఇ-కెవైసి పూర్తయిందని చెప్పారు. ఇ-కెవైసి ప్రక్రియను సులభతరం చేసేందుకే ఫేస్ అథెంటికేషన్‌ను ప్రవేశపెట్టినట్టు చెప్పారు.

మత వైవిధ్యం చాలా ముఖ్యం

- మోడీకి బైడెన్ హితవు



వాషింగ్టన్ : మత వైవిధ్యం భారతదేశం, అమెరికాల ప్రాథమిక సూత్రమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. చట్టం ముందు సమానత్వం, వాక్ స్వాతంత్ర్యం, ప్రజల్లో భిన్నత్వం రెండు దేశాల చరిత్రను నిర్ణయించే అంశాలని అన్నారు. ఈ అంశాలు వివిధ దశల్లో తీవ్ర సంక్షోభాలను తట్టుకుని నిలబడ్డాయని బైడెన్ చెప్పారు. అమెరికా పర్యటనలో భాగంగా అధికారిక విందు కోసం వైట్‌హౌస్‌కు వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీకి స్వాగతం పలుకుతూ ఆయన అన్న మాటలివి. మోడీతో చర్చలో భారతదేశంలో ప్రజాస్వామ్యం, మానవ హక్కుల ఉల్లంఘనను లేవనెత్తాలని 75 మంది డెమొక్రటిక్ ఎంపీలు బైడెన్‌కు లేఖ రాశారు.

భారత్, అమెరికా కలిసి నిలబడితేనే 21వ శతాబ్దపు గమనాన్ని నిర్దేశించవచ్చని కూడా బైడెన్ అన్నారు. ఆరోగ్యం, వాతావరణ మార్పులు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తదితర అనేక అంశాలపై ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ఈ చర్చలు భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని మోడీ అన్నారు.

బైడెన్-మోడీ చర్చల అనంతరం రక్షణ, అంతరిక్షం, గ్రీన్ ఎనర్జీ, వినూత్న సాంకేతికతల్లో కలిసి పని చేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025లో చంద్రునిపైకి మానవులను పంపే అమెరికా ఆర్టెమిస్ మిషన్‌లో భారత్ భాగస్వామ్యంతో సహా ప్రకటనలు కూడా ఉంటాయి. అంతకుముందు జరిగిన చర్చలో అమెరికా చిప్‌ల తయారీ కంపెనీ మైక్రోన్ టెక్నాలజీని మోడీ భారత్‌కు ఆహ్వానించారు. మోడీ వైట్‌హౌస్‌కు రాగానే జో బైడెన్, ఆయన భార్య జిల్ విందు సిద్ధం చేశారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. 400 మంది అతిథులు కూడా హాజరయ్యారు. భారతదేశ వైవిధ్యాన్ని గౌరవించే సంగీత ఉత్సవం కూడా నిర్వహించారు. బైడెన్, జిల్ 20వ శతాబ్దంలో తయారు చేసిన పురాతన కెమెరా, అమెరికన్ బుక్ గ్యాలీని మోడీకి బహూకరించారు.

నిరసన బలంగా ఉంది

భారతీయ అమెరికన్లలో నరేంద్ర మోడీ ప్రజాదరణ పడిపోయింది అంతర్జాతీయ శాంతి కోసం పనిచేస్తున్న అంతర్జాతీయ ఏజెన్సీ కార్నెగీ ఎండోమెంట్ నిర్వహించిన అధ్యయనంలో అమెరికాలోని 50 శాతం మంది భారతీయులు మాత్రమే మోడీకి మద్దతిస్తున్నారని తేలింది. కాశ్మీర్ స్వయంప్రతిపత్తిని తొలగించి, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న మోడీని అమెరికా అధ్యక్షుడు విందుకు ఆహ్వానించి, కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో మాట్లాడే అవకాశం ఇవ్వడం బాధాకరమని ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్ అధికారి అజిత్ సాహి అన్నారు. యుఎస్‌లో పెరిగిన కళాశాలల్లో చదువుకున్న యువత మోడీ రాజకీయాలకు దూరంగా ఉన్నారని ఆయన అన్నారు. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ కౌన్సిల్ ఆన్ అమెరికన్ ఇస్లామిక్ రిలేషన్స్ వీడియో సందేశాన్ని విడుదల చేసింది.

బిజెపిని ఐక్యంగా ఎదుర్కొంటాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటుందని, అందుకే పాట్నాలో ఈ తొలి సమావేశాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. "మేమంతా ఐక్యంగా ఉన్నాం. బిజెపికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతాం" అని అన్నారు. "బిజెపి చరిత్రను మార్చాలని కోరుకుంటుంది. అయితే మేము చరిత్రను రక్షించేలా చూస్తాం" అని అన్నారు. తాము ప్రతిపక్ష పార్టీలమేనని, దేశభక్తి ఉన్న దేశ పౌరులమని, 'భారత మాతను' ప్రేమించే వారిమని ఆమె నొక్కి చెప్పారు. ఫాసిస్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించడమే తమ లక్ష్యమని చెప్పారు.

జమ్ముకాశ్మీర్‌కు చేరని ప్రజాస్వామ్యం: ఒమర్ అబ్దుల్లా

దేశంలో మరీ ముఖ్యంగా జమ్ముకాశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ పాట్నాలో సమావేశమైనట్టు నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రజాస్వామ్యం హత్యకు గురైన దేశంలోనే తాను, మెహబూబా ముఫ్తీ ఉన్నామని అన్నారు. ప్రజాస్వామ్యంపై అమెరికాలో గురువారం చర్చలు జరిగాయని, జమ్ముకాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం ఎందుకు ఖూనీ చేశారో ప్రస్తావిస్తే బాగుండేదని ఒమర్ అన్నారు. ప్రజాస్వామ్యంపై దాడి జరగడం జమ్ము కాశ్మీర్‌లో ప్రారంభమైందని, ఇప్పుడు దేశమంతటికీ విస్తరించిందని పిడిపి అధినేత మెహబూబా ముఫ్తీ అన్నారు.

దేశ సమగ్రతను కాపాడేందుకు వచ్చాం: ఉద్ధవ్ థాకరే

మాకు భిన్నమైన సిద్ధాంతాలు ఉన్నాయని, కానీ దేశ వైవిధ్యం, సమగ్రతను కాపాడటానికి తాము కలిసి వచ్చామని మహారాష్ట్ర మాజీ సిఎం ఉద్ధవ్ థాకరే అన్నారు.

బిజెపిపై సంఘటిత పోరు : డి.రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ బిజెపిపై సమైక్య పోరు సాగించే విషయంలో ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలన దారుణంగా ఉంది. దేశ ప్రజాస్వామ్య, లౌకిక నిర్మాణం దాడికి గురైందని విమర్శించారు. మత-కార్పొరేట్ కూటమికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని దుయ్యబట్టారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం సిగ్గులేకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. సమాఖ్య వ్యవస్థను కూడా ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, సమిష్టి పోరాటంతోనే బిజెపిని అధికారం నుంచి తరిమికొట్టగలమని రాజా అన్నారు.

ఈ సమావేశంలో లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్, మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, టిఆర్ బాలు (డిఎంకె), జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ (జెఎంఎం), ఢిల్లీ, పంజాబ్ సిఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, రాజ్యసభ ఎంపిలు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా (ఆప్), ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ (ఎస్‌పి), కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), సుప్రియా సూలే, ప్రఫుల్ పటేల్ (ఎన్‌సిపి), ఆదిత్య థాకరే, సంజయ్ రౌత్ (శివసేన ఉద్ధవ్ థాకరే), అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఒబ్రెయిన్, ఫిర్హాద్ హకీమ్ (టిఎంసి), లలన్ సింగ్ (జెడియు), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ(ఎంఎల్)) తదితరులు పాల్గొన్నారు.



మీ కోసం
ఈగలు ఎక్కువగా వస్తున్న ప్రదేశంలో పుదీనా ఆకులను కత్తిరించి పెడితే ఈగల బెడద తగ్గుతుంది.

జీవన సౌరభం
గమ్యం ఎంత దూరంలో ఉన్నప్పటికీ దానిని చేరుకునే మార్గం మాత్రం మొదటి అడుగు నుంచే మొదలవుతుంది.

ఎలా? ఎలా?



పీడ కలలు ఆపుటెలా?
చీడపురుగును చంపుటెలా?
క్రీడలలో గెలుచుటెలా?
నీడ పొడవు మారునెలా?

ఊడ విస్తరించుటెలా?
దూడ పాలు తాగుటెలా?
గూడ కొంగ వలసలెలా?
చూడకుండ నమ్ముటెలా?


కాడలేని సుమముందా?
పాడలేని పికముందా?
ఆడలేని శిఖి ఉందా?
వీడక గ్రహణము ఉందా?

కడవలెలా చేస్తారు?
పడవలెలా తోస్తారు?
పిడకలేల చేస్తారు?
పుడకలేల తెస్తారు?

కుండలెవరు చేశారు?
కొండనెవరు తొలిచారు?
బండనెవరు మలిచారు?
ఎండనెవరు ఇస్తారు?

గడగడమని ప్రశ్నలడుగు
తడబడకనె జవాబివ్వు
ఎడతెగకుండా ఎగసే
కడలి అలల వోలె సాగు !

- గుడిపూడి రాధికారాణి,
మచిలీపట్నం.



దారి చూపండి

చిన్నారులూ, క్యాప్సికమ్, చెర్రీ మంచి స్నేహితులు. మరి క్యాప్సికమ్ చెర్రి దగ్గరకు చేరుకోవాలి. దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



- ఈ. యుక్తిక, 1వ తరగతి, కృష్ణలంక, విజయవాడ. ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ బాలిక తలెత్తుకొని నడిచేలా ...

డాక్టర్ దీపక్‌కు దూర ప్రాంతాలకు సైక్లింగ్ చేయడం అలవాటు. ఆ దారిలో అనుకోకుండా ఎదురైనా ఓ పాప వైకల్యాన్ని తొలగించే వరకూ ఆయన పట్టు వదల లేదు. ముక్కు, ముఖం తెలియని ఆ పాపకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న తలంపుతో భారం మొత్తం తన మీదే వేసుకున్నాడు. పెద్ద పెద్ద వైద్యుల మాట్లాడారు. వేల కిలోమీటర్లు ప్రయాణించాడు. సాహసంతో కూడిన శస్త్రచికిత్సను ధైర్యంగా చేయించాడు. లక్షలతో కూడుకున్న వైద్యాన్ని ఉచితంగా అందించి ఆ బాలిక తలెత్తుకొని నడిచేలా చేశాడు.

గత ఏడాది గుజరాత్‌కు చెందిన తొమ్మిది మంది సీనియర్ సిటిజన్స్ కోటేశ్వర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లోని కిబితు వరకు 40 రోజుల పాటు సైకిల్ యాత్రకు బయల్దేరారు. అందులో 69 ఏళ్ల డాక్టర్ దీపక్ కులకర్ణి ఉన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో వారి సైకిల్ యాత్ర అసోం నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని సన్‌పురాకు చేరుకుంది. అక్కడ వివేకానంద కేంద్ర విద్యాలయ స్కూలు సిబ్బంది ఈ బృందానికి ఆశ్రయం ఇచ్చి భోజన ఏర్పాట్లు చేశారు. ఉదయం స్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న పెరియడ్‌లో క్రీడల ఆవశ్యకత, చదువు శ్రద్ధపై ఉపన్యాసం ఇచ్చాడు దీపక్. ఆ సమయంలో మెడను ఏటూ కదపకుండా, ఓ వైపు తలవాల్చి ఉన్న పది ఏళ్ల బాలిక ముస్కాన్‌ను చూశారు. ఆ బాలిక టోర్టికోలిస్ అనే మెడ వైకల్యంతో పుట్టింది.





ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

మాక్సిల్లోఫేషియల్ సర్జన్‌గా దీపక్‌కు 45 ఏళ్ల అనుభవం ఉంది. పాపకు సర్జరీ చేస్తే వైకల్యం తొలగిపోతుందని సలహా ఇచ్చారు. ఇలాంటి వైకల్యాన్ని శస్త్రచికిత్సతో తొలగించొచ్చు అని, ఆలస్యం చేయకుండా వైద్యం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచన చేశారు. ముస్కాన్ తల ఒక వైపుకు వంగి ఉంటుంది. వయస్సు చిన్నదే కాబట్టి సమస్య తొలగిపోవచ్చు అని డాక్టర్ చెప్పారు. ఆమె తల్లిదండ్రులతో మాట్లాడి తనను సంప్రదించమని హెచ్‌ఎంకి సూచించారు. తన ఫోన్ నెంబర్, అడ్రస్ వివరాలను ఇచ్చి, బృందంతో కలిసి సైకిల్ యాత్రలో సాగిపోయారు. కానీ, తనకు ఏ రోజూ ఆ ఊరి నుంచి కాల్ రాలేదు.

యాత్ర పూర్తి చేసి, ఇంటికి చేరిన దగ్గర నుంచి దీపక్ ఆ పాప గురించే ఆలోచించసాగాడు. శస్త్ర చికిత్స చేయించకపోతే భవిష్యత్తులో ఆ పాప జీవితం చాలా దుర్భరంగా ఉంటుందని ఆవేదన చెందాడు. ముస్కాన్ తల్లిదండ్రులతో మాట్లాడే ప్రయత్నం కూడా చేశాడు. కానీ, వారు ఏ సన్నద్ధతా వ్యక్తం చేయలేదు.

రెడు నెలల తర్వాత పాప మేనమామ దీపక్‌కు ఫోన్ చేసి శస్త్రచికిత్స గురించి అడిగాడు. ముస్కాన్‌కు నిజంగా మెడ వస్తుందా? తల నిలబెట్టగలదా? గ్యారెంటీ ఇవ్వగలరా? ప్రాణ హాని ఉండదు కదా? అంటూ అతడు అడిగిన ప్రశ్నలు దీపక్‌కు కొంత బాధ కలిగించాయి. అయినా పాప వైకల్యాన్ని తొలగించాలన్న పట్టుదల ఒక్కటే ఆయన మనసులో ఉంది. ముస్కాన్‌కు ఎటువంటి ప్రమాదమూ లేదని, పాప బాధ్యత తనదంటూ హామీ ఇచ్చాడు. ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పాడు. వారి ఆర్థిక పరిస్థితి తెలిసి ప్రయాణ ఖర్చులకు డబ్బు పంపించాడు.



అందరూ కలిసి మూడు వేల కిలోమీటర్లు ప్రయాణించి పూణేలో ఉన్న సాసూన్ జనరల్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. అక్కడ ప్లాస్టిక్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ పరాగ్ సహస్ర బుధేతో దీపక్ మాట్లాడారు. పాప పరిస్థితి వివరించారు. ఆమెకు పరీక్షలు చేసి రిపోర్టులన్నీ తీసుకుని పై అధికారులతో మాట్లాడారు. వైద్యులు పాప కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేశారు. తరువాత ఈ ఏడాది ఏప్రిల్ 8న ఐదుగురు వైద్యులు కలిసి ముస్కాన్‌కు మెడ భాగానికి సర్జరీ చేశారు. ముస్కాన్ కుటుంబసభ్యులు ఇబ్బంది పడకుండా దీపక్ ఏర్పాట్లు చేశాడు. పాప నొప్పుల నుంచి బయటపడేలా పెయింటింగ్ పుస్తకాలను తీసుకొచ్చి దగ్గరుండి వర్క్ చేయించేవారు. ప్రతిరోజూ పాపను చూసేందుకు ఆసుపత్రికి వచ్చి, మంచి మాటలు చెబుతూ, ఆత్మవిశ్వాసం నింపేవారు. ఇప్పుడు ఆ బాలిక ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడింది. దీపక్ చేసిన మేలుకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

పుట్టకతోనే వైకల్యంతో ముస్కాన్ జన్మించింది. అది చూసి తల్లిదండ్రులు కుంగిపోయారు. కూతురు పరిస్థితి, భవిష్యత్తు తలచుకుంటూ ఏడ్వని రోజంటూ లేదు. ఆమెకు పెళ్లి కాదని నిరాశపడ్డారు. కానీ, డాక్టర్ దీపక్, పరాగ్ ఆమెకు వైకల్యం తొలగించి, జీవితంపై ఆశలు కల్పించారు. ఇప్పుడు ముస్కాన్ తల ఎత్తుకొని నడుస్తోంది. ప్రతిరోజూ తనకిష్టమైన పాటలకు డ్యాన్స్ చేస్తుంది. పిల్లలతో కలిసి ఆడుకుంటుంది. తన వయస్సులో ఉన్న ఇతర పిల్లల్లాగానే సాధారణ జీవితాన్ని గడుపుతోంది.

ఈత పండు .. లాభాలు మెండు ...

వేసవి కాలంలో లభించే ఈత పండ్లను తినటం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రక్తహీనతతో బాధపడేవారు ఈ పండ్లను తింటే ఆ సమస్య నుంచి బయటపడొచ్చు. శరీరంలో రోగనిరోధక శక్తి పెరగటమే కాకుండా శరీరంలో రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది.



- వేసవిలో లభించే ఈత పండ్లను పిల్లలకు తినిపిస్తే వారిలో ఎదుగుదల బాగుంటుంది. వీటిలో సమృద్ధిగా కాల్షియం ఉంటుంది. ఎముకలు బలంగా అవుతాయి.
- అల్జీమర్స్ వ్యాధితో బాధపడేవారికి ఈత పండ్లు తింటే ప్రయోజనం కనపడుతుంది. మెదడు చురుకుగా పని చేస్తుంది.
- ఈత పండ్లలో ఉండే గ్లూకోజ్, సుక్రోజ్, ఫ్రక్టోజ్ తక్షణ శక్తిని ఇస్తాయి. వేసవిలో వచ్చే అలసటను దూరం చేస్తుంది. జీర్ణశక్తి బాగుంటుంది. మలబద్ధకం లాంటి సమస్యలు పోతాయి.
- ఈత పండ్లలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్త వృద్ధి జరుగుతుంది.

ఇద్దరికి సాహిత్య అకాడమీ పురస్కారాలు

- **జానీ తక్కశిలాకు యువ, డికె చదువుల బాబుకు సాహిత్య అకాడమీ బాల పురస్కారం**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర సాహిత్య అకాడమీ 2023కు గానూ యువ, బాల పురస్కారాలను ప్రకటించింది. సాహిత్య అకాడమీ యువ పురస్కారం-2023 తెలుగులో జానీ తక్కశిలా (జానీ బాష చరణ్ తక్కశిలా)కు వచ్చింది. ఆయన రాసిన వివేచని విమర్శనాత్మక నవలకు పురస్కారం వరించింది. శుక్రవారం నాడిక్కడ కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు మాధవ్ కౌసిక్ అధ్యక్షతన అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం జరిగింది. జ్యూరీ సభ్యులు ప్రతిపాదనల మేరకు మొత్తం 20 భాషలకు సంబంధించిన 20 మంది రచయితలను యువ పురస్కారానికి, 22 మంది బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక చేశారు. మణిపూరి, మైథాలీ, సంస్కృతంలో యువ పురస్కారాలను తరువాత



ప్రకటిస్తారు. సమావేశ అనంతరం అకాడమీ కార్యదర్శి కె శ్రీనివాసరావు అవార్డు గ్రహీతల జాబితాను విడుదల చేశారు. అవార్డు గ్రహీతలకు రూ.50 వేల నగదు, రాగి మెమోంటో అందజేస్తారు. యువ పురస్కారానికి తెలుగు భాషకు జ్యూరీ సభ్యులుగా ఆవుల మంజులత, డి శ్రీనివాసచార్యా, వెడ్డేపల్లి కృష్ణ వ్యవహరించారు. తెలుగుకు సంబంధించి మొత్తం తొమ్మిది నవలలు రాగా, అందులో వివేచనీ విమర్శనాత్మక నవలను జ్యూరీ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.డికె చదువుల బాబుకు సాహిత్య అకాడమీ బాల పురస్కారం-2023 వరించింది. ఆయన రాసిన వజ్రాల వాన (షార్ట్ స్టోరీ) చిన్న కథకు ఈ పురస్కారం లభించింది. అవార్డు గ్రహీతలకు రూ.50 వేల నగదు, రాగి మెమోంటో అందజేస్తారు. బాల పురస్కారానికి తెలుగు భాషకు సంబంధించి దాసరి వెంకటరమణ, కండెపి రాణిప్రసాద్, నరంశెట్టి ఉమామహేశ్వరరావు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. తెలుగు భాషలో మొత్తం ఎనిమిది పుస్తకాలు రాగా అందులో డికె చదువుల బాబు రాసిన వజ్రాల వానను జ్యూరీ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

సంజు, సైనీలకు పిలుపు



సంజు శాంసన్



సైనీ

జైస్వాల్‌కు టెస్టుల్లో చోటు • వెస్టిండీస్ పర్యటనకు జట్లను ప్రకటించిన బిసిసిఐ

ముంబయి: వెస్టిండీస్ పర్యటనకు వెళ్లే ఆటగాళ్ల జాబితాను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) శుక్రవారం వెల్లడించింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఓటమితో దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా యువకులకు అవకాశాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే విండీస్ పర్యటనకు యువ క్రికెటర్లకు తొలి ప్రాధాన్యతనిచ్చి.. ఛటేశ్వర పుజారాకు టెస్టులనుంచి తప్పించింది. టెస్టులు, వన్డేలకు రోహిత్ శర్మ సారథ్యం వహించనున్నాడు. అజింక్యా రహానే టెస్టుల్లో తన స్థానాన్ని మరోసారి నిలబెట్టుకొని వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్ పేసర్ షమీకి విశ్రాంతి నిచ్చిన బిసిసిఐ.. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు స్టాండ్‌బైగా ఎంపికైన యువ సంచలనం యశస్వి జైస్వాల్ టెస్టు జట్టులోకి వచ్చాడు. అలాగే పేసర్ ముఖేష్ కుమార్ చోటు దక్కించుకున్నారు. వికెట్ కీపర్, బ్యాటర్ సంజూ శాంసన్‌తోపాటు నవ్‌దీప్ సైనీలకు వన్డే



యశస్వి జైస్వాల్

జట్టులో చోటు దక్కింది. అలాగే ఐపిఎల్ సీజన్-16లో అదరగొట్టిన రుతురాజ్ గైక్వాడ్, ఫాస్ట్ బౌలర్ ముకేశ్ కుమార్ వన్డే, టెస్టు జట్టులోని 16 మందిలో చోటు సంపాదించారు. విండీస్ పర్యటనలో భారతజట్టు రెండు టెస్టులు, మూడు వన్డేలతోపాటు ఐదు టి20ల సిరీస్ ఆడనుంది. టి సిరీస్‌లో ఆడే జట్టును బిసిసిఐ తర్వాత ప్రకటించనున్నట్లు తెలిపింది.

టెస్టులకు: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, గైక్వాడ్, కోహ్లీ, జైస్వాల్, రహానే(వైస్ కెప్టెన్), భరత్, ఇషాన్(వికెట్ కీపర్లు), అశ్విన్, జడేజా, శార్దూల్, అక్షర్, సిరాజ్, ముకేశ్, ఉనాద్కట్, సైనీ.

వన్డేలకు : రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, రుతురాజ్ గైక్వాడ్, కోహ్లీ, సూర్యకుమార్, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్లు), హార్దిక్(వైస్ కెప్టెన్), జడేజా, శార్దూల్, అక్షర్, చాహల్, కుల్దీప్, ఉనాద్కట్, సిరాజ్, ఉమ్రాన్, ముకేశ్.

షెడ్యూల్..

జులై 12-16 : తొలిటెస్ట్(విండ్సోర్ పార్క్, డొమినిక)
జులై 20-24 : రెండోటెస్ట్(క్వీన్స్ పార్క్, ట్రినిడాడ్)
జులై 27 : తొలి వన్డే(బార్బొడాస్)
జులై 29 : రెండో వన్డే(బార్బొడాస్)
ఆగస్టు-1 : మూడో వన్డే(ట్రినిడాడ్)

విపత్తుల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విపత్తుల నిర్వహణపై 2022 బ్యాచ్‌కు చెందిన 9 మంది ఐఎఎస్ అధికారులకు శుక్రవారం రాష్ట్ర కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితుల్లో రాబోయే 10 సంవత్సరాల్లో అధికారులు అవసరాల ఆధారంగా విపత్తుల నిర్వహణ అంశంపై ఎంపిక చేయబడినట్లు వివరించారు.

శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్లు వారి ఫీల్డ్ పోస్టింగుల్లో మొదటి రోజు నుంచి క్లిష్టమైన బాధ్యతలను నిర్వర్తించేందుకు సిద్ధం చేయడం ఈ శిక్షణ లక్ష్యమన్నారు. 5,600 మంది కమ్యూనిటీ వలంటీర్లకు 6 వేలమంది గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి విపత్తుల నిర్వహణలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

శిక్షణ కార్యక్రమంలో ఐఎఎస్ అధికారులు బి సహదిత్ వెంకట్ త్రివాంగ్, సి యశ్వంత్ కుమార్‌రెడ్డి, కల్పశ్రీ కెఆర్, కుశల్‌జైన్, మంత్రిమౌర్య భరద్వాజ్, రాఘవేంద్రమీనా, శౌర్యమాన్ పటేల్, తిరుమని శ్రీపూజ. వి సంజన సింహా, విపత్తుల సంస్థ ఇడి సి నాగరాజు, ఎస్ఇఒసి ఇన్‌ఛార్జి సిహెచ్ శాంతి స్వరూప్, ప్రాజెక్టు మేనేజరు పూర్ణచంద్ పాల్గొన్నారు.

జిందాల్ స్టీల్ బిడ్‌ను పరిగణనలోకి తీసుకోండి

- **గనులశాఖకు హైకోర్టు ఆదేశం**

ప్రజాశక్తి-అమరావతి

ప్రకాశం జిల్లా, అద్దంకివారి పాళెం, లక్ష్మక్కపల్లి ఉత్తరం, దక్షిణం ఐరన్‌ఓర్ బ్లాకుల్లో ఖనిజాన్వేషణ, లీజుల మంజూరుకు సంబంధించిన కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. టెండర్ విషయంలో జిందాల్ స్టీల్ ఆంధ్రా లిమిటెడ్ సమర్పించే టెక్నికల్ బిడ్ ఒరిజినల్ ఫిజికల్ డాక్యుమెంట్లను స్వీకరించాలని గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఇతర బిడ్లతో కలిపి దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలంది. శుక్ర, శనివారం సాయంత్రం 5 లోపు టెక్నికల్ బిడ్ భౌతిక కాపీలను అందజేయాలంటూ జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిందాల్ ఇ-టెక్నికల్ బిడ్‌ను ఆమోదించిన గనులశాఖ అధికారులు ఒరిజినల్ ఫిజికల్ కాపీలను మాత్రం తీసుకోవడం లేదన్న కేసు విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది.

జంతు వధ నివారణ చర్యలు తీసుకోండి..

జంతు వధ, అక్రమ రవాణా నివారణ చర్యలు తీసుకోవాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలంది. వీటిపై ప్రజలు ఫిర్యాదులను స్వీకరించేందుకు నోడల్ అధికారులను 3 రోజుల్లోగా నియమించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బక్రీద్ సందర్భంగా జంతు వధను, అక్రమ రవాణా నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ కార్యదర్శి గోపాలరావు, ఇతరులు వేసిన పిల్‌పై పై ఉత్తర్వులు జారీ చేసింది. జంతు అక్రమ రవాణా, గోవధ నిరోధానికి తీసుకున్న చర్యలను నివేదించాలని గుంటూరు మున్సిపల్ కమిషనర్‌ను న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఆదేశించారు. గుంటూరులో యథేచ్ఛగా గోవధ జరుగుతోందంటూ ఆ జిల్లా జంతుహింస నిరోధక కమిటీ సభ్యులు దాసరి రామ్మోహనరావు ఇతరులు వేసిన రిట్‌పై విచారణను వాయిదా వేశారు.

కడపలో వైసిపి కార్యకర్త దారుణ హత్య

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలో పట్టపగలే నడిరోడ్డుపై వైసిపి కార్యకర్తను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి అతికిరాతకంగా హత్య చేశారు. ఆర్‌టిసి చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జునరెడ్డికి ప్రధాన అనుచరుడైన శ్రీనివాసులరెడ్డి ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురికావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు.. నగరంలోని సంధ్యా సర్కిల్‌లో ఉన్న జిమ్‌లో వ్యాయామం ముగించుకుని తన ఇంటికి శ్రీనివాసులరెడ్డి వెళ్తున్నారు. బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు బురఖాలతో వచ్చి వేట కొడవలితో ఆయనపై దాడి చేశారు. దీంతో, తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులరెడ్డిని స్థానికులు హుటాహుటిన రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మతి చెందారు.

కొంత మంది వ్యక్తులతో ఉన్న భూ తగాదాలే హత్యకు కారణమని తెలుస్తోంది. సిసి ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. శ్రీనివాసులరెడ్డి మృతదేహాన్ని ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. హత్య వెనుక ఎవరున్నారో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రవీంద్ర నాథ్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శ్రీలంక ఘన విజయం

ఓమన్‌పై 10వికెట్ల తేడాతో గెలుపు



హసరంగ (5/13)

హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫై గ్రూప్-బిలో శ్రీలంక, స్కాట్లాండ్ జట్లు ఘన విజయం సాధించాయి. శుక్రవారం జరిగిన లీగ్ పోటీల్లో మాజీ ఛాంపియన్ శ్రీలంక జట్టు 10వికెట్ల తేడాతో ఓమన్‌ను ఓడించగా.. స్కాట్లాండ్ జట్టు 111పరుగుల తేడాతో యుఏఇపై ఘన విజయం సాధించింది. బులావయో వేదికగా జరిగిన పోటీలో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఓమన్ జట్టు హసరంగ(5/13) దెబ్బకు 30.2 ఓవర్లలో 98పరుగులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని లంక జట్టు 15ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్ దిముత్ కరుణరత్నే(61నాటౌట్) అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. మరో ఓపెనర్ ప్రథుమ్ నిస్సంక(37 నాటౌట్)గా నిలిచాడు. హసరంగకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఓమన్‌పై భారీ విజయంతో లంక ఈ ఏడాది వన్డే వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ అవకాశాలు మెరుగుపరుచుకుంది. గ్రూప్ -ఏ, గ్రూప్ -బిలో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు వరల్డ్ కప్‌లో ఆడేందుకు అర్హత సాధిస్తాయి.

స్కాట్లాండ్ సునాయాసంగా..

మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు యుఏఇపై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 282పరుగులు చేసింది. కెప్టెన్ బెర్రింగ్టన్(127) సెంచరీతో చెలరేగాడు. సిద్ధిక్‌కు మూడు, నసేర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో యుఏఇ జట్టు 35.3ఓవర్లలో 171పరుగులకు కుప్పకూలింది. షరీఫ్‌కు నాలుగు, సోలేకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బెర్రింగ్టన్‌కు లభించింది.

భారత ఫుట్‌బాల్ కోచ్ స్టిమాక్‌పై ఒక మ్యాచ్ నిషేధం

బెంగళూరు: భారత ఫుట్‌బాల్ కోచ్ ఇగోర్ స్టిమాక్ ఒక మ్యాచ్ నిషేధానికి గురయ్యాడు. శాఫ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా స్టిమాక్ దురుసుగా ప్రవర్తించాడు. దీంతో అతడు మ్యాచ్ రిఫరీ నుంచి రెడ్ కార్డ్‌కు గురయ్యాడు. మ్యాచ్ అనంతరం రిఫరీ, కమిషనర్ నివేదిక ప్రకారం సౌత్ ఆసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(శాఫ్) జనరల్ సెక్రటరీ అన్వరుల్ హక్‌కు పంపగా.. గొడవకు మూలకారకుడైన స్టిమాక్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు శాఫ్ క్రమశిక్షణా కమిటీ స్టిమాక్‌పై నిషేధం విధించింది. దీంతో భారతజట్టు మంగళవారం కువైట్‌తో తలపడే మ్యాచ్‌కు స్టిమాక్ దూరం కానున్నాడు.

క్వార్టర్స్‌లో ప్రణయ్ ఓటమి

తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



తైపీ: తైపీ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరి ఆశలు రేపిన హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్ ఓటమిపాలయ్యాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 9వ ర్యాంకర్ ప్రణయ్ 19-21, 8-21తో హాంకాంగ్‌కు చెందిన లాంగ్-అంగస్ చేతిలో ఓడాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో లాంగ్ 5వ ర్యాంక్‌లో ఉన్నాడు. తొలి గేమ్‌లో ప్రణయ్ తొలుత 6-5పాయింట్లతో ఆధిక్యతలో నిలిచాడు. తొలి గేమ్ పోటాపోటీగా సాగింది. ఇదే క్రమంలో 12-12, 19-19పాయింట్లతో లాంగ్‌కు సమంగా నిలిచాడు. ఆ తర్వాత ప్రణయ్ వరుసగా రెండు పాయింట్లు కోల్పోవడంతో లాంగ్ ఆ గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక రెండో గేమ్‌లో ప్రణయ్ ఆశించినస్థాయిలో రాణించలేకపోయాడు.

రేహానుకు చోటు

యాషెస్ సిరీస్ రెండోటెస్ట్‌కు జట్టును ప్రకటించిన ఇంగ్లండ్

లండన్: యాషెస్ సిరీస్ తొలిటెస్ట్‌లో అనూహ్య పరాజయాన్ని చవిచూసిన ఇంగ్లండ్ జట్టు.. ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్ట్‌కు జట్టును ప్రకటించింది. 18మంది ఆటగాళ్లతో కూడిన జట్టును ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్‌బోర్డు శుక్రవారం ప్రకటించింది. గాయపడ్డ మొయిన్ అలీ స్థానంలో 18ఏళ్ల లెగ్ స్పిన్నర్ రేహన్ అహ్మద్ చోటు దక్కించుకున్నాడు. గత ఏడాది పాకిస్తాన్ పర్యటనకు వెళ్లిన ఇంగ్లండ్ జట్టులో సభ్యుడైన రేహన్.. కరాచీ టెస్టులో ఏడు వికెట్లతో సత్తా చాటాడు. లిసెస్టర్‌షైర్‌కు చెందిన రేహన్ 11 ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో 37 వికెట్లు తీయడంతోపాటు 33.10తో యావరేజ్ 629పరుగులు చేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68